ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 **అనంతపురం** జిల్లా వార్తలు

శనివారం 4 మే 2024





ఉష్ణోగ్రతలు

గరిష్ఠం కనిష్ఠం 44.0 28.0

మార్పు మొదలైంది గురూ..!



మేనిఫెస్టోలో ఆర్థిక భరోసానిచ్చే పథకాలు

వైసీపీ అభ్యర్థులకు కూటమి మేనిఫెస్టో ఫోబియా

కూటమికే జై కొడుతున్న మహిళలు

అనంతపురం, మే 3(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎన్నికల మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజల్లోనూ మార్పునకు నాంది పలుకుతోంది. వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విడుదల చేసిన ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో, కూటమి మేనిఫెస్టోను ప్రజలు బేరీజు వేసుకుంటుండటమే ఇందుకు ప్రధాన కారణం. ఐదేళ్ల వైసీపీ పాలనలో నవరత్నాల పేరుతో అరకొర లబ్ధి చేకూర్చడం మినహా... అభివృద్ధిని పూర్తిస్థాయిలో విస్మరించారనే అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో అమలు పరిచిన పథకాలనే మళ్లీ మేనిఫెస్టోలో పొందుపరిచారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతాంగం, కార్మికులు, మహిళల్లోనూ వైసీపీ పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. గత ఎన్నికల సమయంలో అమ్మఒడి పథకాన్ని ఇంట్లో ఇద్దరు పిల్లలున్నా అమలు చేస్తామని జగన్ హామీ ఇచ్చారు. తీరా ఒక్కరికే అమలు చేశారు. అమ్మఒడి ద్వారా ఒక్కొక్కరికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. చివరకు రూ.13 వేలతో సరిపెట్టారు. వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలతో మహిళల ఆర్థిక సాధికారితకు పెద్ద పీట వేస్తామని చెప్పారు. బటన్ నొక్కారేగాని.. సకాలంలో వారి ఖాతాల్లో సొమ్ము జమచేయలేదు. చేయూత, ఆసరా సొమ్ము ఈ విడత ఇంకా జమకాలేదు. మహిళలకు సంబంధించిన పథకాలను సక్రమంగా అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఈ పరిణామాలన్నీ వైసీపీని మరింత ఇరుకునపెడుతున్నాయి.



కూటమికే జై..

కూటమి మేనిఫెస్టోలో మహిళల ఆర్థిక స్వావలంబనకు, సాధికారితకు పెద్దపీట వేశారు. దీంతో ఆ వర్గాలు కూటమికి జై కొడుతున్నాయి. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం పేరుతో.. ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రకటించారు. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామన్నారు. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ పెంచడం, ప్రత్యేక పథకం ద్వారా పి-4 మోడల్లో మహిళలకు ఆర్థికంగా బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యుటీ చెల్లిస్తామనడం, ఆశా వర్కర్లకు కనీస వేతనం పెంచేందుకు చర్యలు తీసుకుంటామనడం, ఉద్యోగాలు చేసే మహిళలకు హాస్టల్ వసతి కల్పిస్తామనడం, కళలకు రెక్కలు పథకం ద్వారా విద్యార్థినులకు రుణాలు అందిస్తామనడం, పండుగలు, పెళ్లిళ్లకు కానుకలు పునరుద్ధరిస్తామని చెప్పడం, దీపం పథకం ద్వారా ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తామనడం మహిళల్లో సంతోషాన్ని నింపుతోంది. వైసీపీ పాలనలో జరిగిన లబ్ధితో పోల్చుకుంటే.. కూటమి మేనిఫెస్టోలో మహిళల కోసం అమలు చేయబోయే పథకాల ద్వారానే ఎక్కువ లబ్ధి చేకూరుతుందని మహిళలు అంటున్నారు. కుటుంబానికి ఆర్థిక చేయూతతో పాటు.. జీవన ప్రమాణాల పెంపునకు టీడీపీ మేనిఫెస్టో బాటలు వేస్తుందన్న నమ్మకం మహిళల్లో కనిపిస్తోంది.

మహిళలే నిర్ణేతలు..

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అన్ని నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 20,20,243 మంది కాగా, వీరిలో పురుషులు 9,99,835 మంది, మహిళలు 10,20,162 మంది ఉన్నారు. ఇతరులు 246 మంది ఉన్నారు. పురుషులకంటే మహిళలు 20,327 మంది అధికంగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే... రాయదుర్గం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,64,418 మంది కాగా, అందులో పురుష ఓటర్లు 1,30,858 మంది, మహిళా ఓటర్లు 1,33,518 మంది ఉన్నారు. ఉరవకొండలో 2,24,574 మంది ఓటర్లుండగా... అందులో పురుషులు 1,10,772 మంది, మహిళలు 1,13,774 మంది ఉన్నారు. గుంతకల్లులో 2,71,057 మంది కాగా.. పురుషులు 1,33,347 మంది, మహిళలు 1,37,635 మంది ఉన్నారు. తాడిపత్రిలో 2,49,103 మంది ఓటర్లుండగా... పురుషులు 1,23,714 మంది, మహిళలు 1,25,369 మంది ఉన్నారు. శింగనమలలో 2,47,803 మంది ఓటర్లుండగా... పురుషులు 1,23,351 మంది, మహిళలు 1,24,423 మంది ఉన్నారు. అనంతపురం అర్బన్‌లో 2,81,403 మంది ఓటర్లుండగా... పురుషులు 1,37,890 మంది, మహిళలు 1,43,488 మంది ఉన్నారు. కళ్యాణదుర్గంలో 2,30,905 మంది ఓటర్లుండగా... పురుషులు 1,14,473 మంది, మహిళలు 1,16,426 మంది ఉన్నారు. రాప్తాడులో 2,50,979 మంది ఓటర్లుండగా, పురుషులు 1,25,430 మంది, మహిళలు 1,25,537 మంది ఉన్నారు. ఇలా.. ఎన్నికల్లో గెలుపోటములను మహిళా ఓటర్లే అన్ని నియోజకవర్గాల్లో నిర్ణయించనున్నారు. ఇది టీడీపీ కూటమిలో జోష్ నింపుతుండగా.. వైసీపీ అభ్యర్థుల్లో గుబులు పుట్టిస్తోంది.



మేనిఫెస్టో ఫోబియా..

జిల్లాలో వైసీపీ అభ్యర్థులకు కూటమి మేనిఫెస్టో ఫోబియా పట్టుకుంది. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక చేయూతనిచ్చేలా కూటమి మేనిఫెస్టో ఉంది. ఇది వైసీపీ అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఐదేళ్లలో అమలు చేసిన నవరత్నాలనే కొనసాగిస్తూ.. వైసీపీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఇది ఆ పార్టీ అభ్యర్థులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. సీఎం జగన్.. 175కి 175 స్థానాలు గెలవాలని చెబుతున్నారేగాని.. అందుకు అనుగుణంగా మేనిఫెస్టోను రూపొందించలేకపోయారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాకు ఇచ్చిన ఏ ఒక్క హామీని జగన్ నెరవేర్చలేదు. టీడీపీ మేనిఫెస్టో ప్రజల జీవన ప్రమాణాలను పెంచేలా, అభివృద్ధికి బాటలు వేసేలా ఉంది. రాయలసీమ మిషన్ పేరుతో సీమ అభివృద్ధిని కాంక్షించే అంశాలు ఉన్నాయి. ఈ పరిణామాలను చూసి వైసీపీ అభ్యర్థులకు ఓటమి భయం పట్టుకుంది.



తాడిపత్రి @ 46

నిప్పుల కొలిమి.. జిల్లా

బుక్కరాయసముద్రం, మే 3: జిల్లాలో రికార్డుస్థాయిలో ఎండలు నమోదువుతున్నాయి. బయట అడుగు పెట్టాలంటే జనం బెంబేలెత్తుతున్నారు. మే నెలలో ఎప్పుడూ లేనంతగా ఈ ఏడాది అత్యధికంగా పగటి ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. రానున్న రోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రేకులకుంట ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి హెచ్చరించారు. వడగాల్పుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. మే నెలలో గత 20 సంవత్సరాలలో లేనంతగా.. తాడిపత్రిలో శుక్రవారం 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెలలో సాధారణ పగటి ఉష్ణోగ్రతలు 40-41 డిగ్రీలు నమోదు కావాలి. కానీ 5-6 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా నమోదువుతున్నాయి. ఉదయం 8 గంటల దాటితే... భానుడు భగభగమంటున్నాడు. జిల్లాలో శుక్రవారం శింగనమలలో 45.9, పుట్లూరు 45.6, నార్పల 44.7, గుంతకల్లు 44.7, యల్లనూరు 44.4, విడపనకల్లు, అనంతపురం 44, పెద్దవడుగూరు 43.9, యాడికి 43.9, డి.హీరేహాళ్ 43.7, బుక్కరాయసముద్రం 43.5, గార్లదిన్నె 43.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

లెక్కలు తేలుస్తాం: కలెక్టర్

అనంతపురం టౌన్: అనంతపురం లోక్‌సభకు పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఈనెల 5, 10 తేదీల్లో తనిఖీలు చేపడుతున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నామినేషన్లు దాఖలు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఖర్చుపెట్టిన వివరాలకు బిల్లులు, ఓచర్లు, రికార్డులు ఆయా తేదీల్లో కలెక్టరేట్‌లోని మినీ హాల్‌లో ఏర్పాటు చేసిన కమిటీకి చూపించి తనిఖీ చేయించుకోవాలన్నారు. ఆడిట్ చేయించుకోకపోతే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉరవకొండ ఎంపీడీఓ డిస్మిస్

అనంతపురం విద్య, మే 3:

ఉరవకొండ ఎంపీడీఓ అమృత్‌రాజ్‌ను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ నుంచి ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో ఆయన కర్నూలు జిల్లాలో ప్యాపిలి ఎంపీడీఓగా పనిచేశారు. ఆ సమయంలో ఉపాధి పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహించడం, నిధులను దుర్వినియోగం చేయడంతో ఆయనను డిస్మిస్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి కలెక్టరేట్‌కు సమాచారం వచ్చింది. పంచాయతీరాజ్ కమిషనర్ నుంచి జడ్పీకి ఉత్తర్వులు రావాల్సి ఉంది. జడ్పీ డిప్యూటీ సీఈఓగా పనిచేస్తున్న ఆయనపై గత ఏడాది సైతం ఉన్నఫలంగా సస్పెన్షన్ వేటు వేశారు. ఆయన కోర్టును ఆశ్రయించడంతో సస్పెన్షన్ ఎత్తివేశారు. మరోసారి ఆయనపై కక్షగట్టి వేటు వేసినట్టు జడ్పీ వర్గాల్లో చర్చ సాగుతోంది. అమృత్ రాజ్ అనారోగ్య కారణాలతో ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఇప్పటి వరకూ ఆయనకు ఉత్తర్వులు అందలేదని సమాచారం.



పోలింగ్ జాప్యం కారణంగా రాప్తాడు టీటీడీసీ కేంద్రంలో ఓటర్ల రద్దీ

పోస్టల్ ఓటింగ్ గందరగోళం

- ఎంపీ అభ్యర్థుల బ్యాలెట్ పేపర్లు ఆలస్యం
- రాప్తాడులో సాయంత్రానికి ఓటింగ్ ప్రారంభం
- అధికారుల తీరుపై పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల ఆగ్రహం
- రాయదుర్గంలో మధ్యాహ్నం తరువాత పోలింగ్
- ఎన్నికల అధికారుల మధ్య కనిపించని సమన్వయం



తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



ఇదిగో వేలిపై సిరా.. ఇద్దరం ఓటు వేసేశాం..

అనంతపురం టౌన్/రాప్తాడు/రాయదుర్గం, మే 3: ఉపాధ్యాయులు, ఉద్యోగులను పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు దూరంగా ఉంచాలని అధికార పార్టీ ప్రయత్నించింది. దరఖాస్తుల మొదలు ఓటింగ్ వరకూ గందరగోళం కనిపిస్తోంది. ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో పలు కథనాలు వచ్చాయి. అధికారులు స్పందించి.. ఫారం-12 స్వీకరణలో సమస్యలను కొంతవరకూ సరిదిద్దారు. దీంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 23,532 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేశారు. వీరందరికీ శుక్రవారం నుంచి ఈ నెల 6వతేదీ వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ప్రతి నియోజకవర్గంలో ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

తొలిరోజే అస్తవ్యస్తం

ఫెసిలిటీ కేంద్రాల్లో పోస్టల్ ఓటింగ్‌కు జిల్లా యంత్రాంగం తగిన ఏర్పాట్లు చేయలేదు. ఎన్నికల నిబంధనల మేరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరగాలి. కానీ ఎక్కడా నిర్దేశించిన సమయానికి ఓటింగ్ ప్రారంభించలేదు. అనంతపురంలో ఉదయం 10 గంటలకు మొదలైంది. రాప్తాడు పరిధిలోని టీటీడీసీ కేంద్రంలో సాయంత్రం వరకూ మొదలు కాలేదు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎన్నికల అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎరలో పడలేదు..

పోస్టల్ ఓటర్లను అధికార పార్టీ ప్రలోభ పెట్టింది. ఓటుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ ఇస్తామంది. కానీ ఐదేళ్ల పాలనలో వైసీపీ ప్రభుత్వం తమ పొట్ట కొట్టిందని ఆగ్రహంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు.. వారి వలలో పడలేదు. డబ్బులు అవసరం లేదని, నచ్చినవారికి ఓటు వేస్తామని ఖరాకండిగా చెప్పేశారని సమాచారం. ఫెసిలిటీ కేంద్రాల ఏర్పాటు సైతం వారికి కలిసొచ్చింది. పోస్టల్ బ్యాలెట్ చేతికి వస్తే తమపై తీవ్ర ఒత్తిడి ఉండేదని, పైగా తాము అమ్ముకున్నట్లు ప్రచారం జరిగేదని కొందరు గతాన్ని గుర్తు చేసుకున్నారు.

పేర్లు గల్లంతు..

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఫారం-12 సమర్పించినా.. జాబితాలో కొందరి పేర్లు కనిపించలేదు. అనంతపురం అర్బన్‌లో పీఓ, ఏపీఓలు 1,905 మంది, ఓపీఓలు 2,278 మంది ఉన్నారు. వీరికి నగరంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడికి వెళ్లిన పలువురు ఉద్యోగుల పేర్లు జాబితాలో కనిపించలేదు. శ్రీనివాసులు అనే ఉపాధ్యాయుడు, ఆయన భార్య ఫారం-12ను డీఆర్‌డీఏ కార్యాలయంలో అందజేశారు. ఆయన భార్య పేరు మాత్రమే జాబితాలో ఉంది. దాదాపు 30 మంది పేర్లు జాబితాలో కనిపించలేదు. ఈ నిర్లక్ష్యానికి బాధ్యులు ఎవరని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

రాప్తాడులో గందరగోళం

రాప్తాడు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పట్ల ఎన్నికల అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. టీటీడీసీ కార్యాలయంలో ఓటింగ్ కోసం ఉదయం 10 గంటలకే ఓటర్లు చేరుకున్నారు. ఆ సమయానికి అసెంబ్లీ బ్యాలెట్ పేపర్లు మాత్రమే ఉందుబాటులో ఉన్నాయి. ఎంపీ అభ్యర్థుల బ్యాలెట్ పేపర్లు అక్కడికి రాలేదు. పోస్టల్ బ్యాలెట్ మీద గెజిటెడ్ అధికారి సంతకాలు చేసి, సీలు వేయాల్సి ఉండగా.. అక్కడ గెజిటెడ్ అధికారి కనిపించలేదు. దీంతో ఓటింగ్ కోసం వచ్చినవారు ఉదయం నుంచి సాయంత్రం వరకూ చెట్ల కింద పడిగాపులు కాశారు. ఎంపీ బ్యాలెట్ పేపర్లు మధ్యాహ్నం 3:30 గంటలకు వచ్చాయి. ఆత్మకూరు తహీల్దార్ పరమేశ్వరస్వామిని ఇక్కడ ఇన్‌చార్జిగా నియమించారు. కానీ సకాలంలో రాలేదు.

కలెక్టర్‌కు పరిటాల సునీత ఫిర్యాదు

రాప్తాడులో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఆలస్యం పట్ల మాజీ మంత్రి పరిటాల సునీత జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని కోరారు.



తొలిసారి ఫెసిలిటీ సెంటర్‌లో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసినట్లు చూపుతున్న టీచర్

అక్కడా అంతే..

రాయదుర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మధ్యాహ్నం వరకు ప్రారంభించలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నికల అధికారుల్లో సమన్వయం, అవగాహన లేకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఉద్యోగులు పెదవి విరిచారు. నియోజకవర్గంలో 1,105 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పటి వరకు అధికారులు తుదిజాబితాను ప్రకటించలేదు. జాబితాలో 22 మంది పేర్లు, ఐడీలు రెండుసార్లు నమోదైనట్లు తెలిసింది. అభ్యర్థులు అధికారులకు నిలదీయడంతో జాబితాలో వాటికి మార్కింగ్ వేసినట్లు తెలిసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇవి ఏమాత్రం అనుకూలంగా లేవని, మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు కూడా సరైన సమాచారం అందలేని తెలిసింది. ఎన్నికల అధికారుల తీరుపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు పంపినట్లు తెలిసింది. దీంతో అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, డబుల్ ఎంట్రీలు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

ఉద్యోగుల ఆగ్రహం

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం 5 గంటలకు రాప్తాడు తహసీల్దారు సీతారామన్ టీటీడీసీ కార్యాలయానికి చేరుకున్నారు. ఉద్యోగులు ఆయనను జాప్యం ఎందుకైందని ప్రశ్నించారు. 'ఇప్పుడు ఏం కొంపలు మునిగాయి..' అని తహసీల్దారు నిర్లక్ష్యంగా మాట్లాడటంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ పరిస్థితే ఇలా ఉంటే.. 13న సాధారణ ఓటింగ్ పరిస్థితి ఏమిటని అధికారులను నిలదీశారు. ఎట్టకేలకు సాయంత్రం 5:30 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ మొదలైంది.

ఒక్క అవకాశం ఇవ్వండి..!

నిత్యం అందుబాటులో ఉంటా

మీ సేవకున్నవుతా.. అభివృద్ధి చేస్తా

టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, మే 3: ఒక్క అవకాశం ఇస్తే అనంత అర్బన్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. నిత్యం అందుబాటులో ఉంటానని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రజ్యోతితో శుక్రవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు..

● ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది..?

దగ్గుబాటి: మా ఎన్నికల ప్రచారం ప్రతి రోజు అశేష జనవాహిని మధ్య సాగుతోంది. ఏ కాలనీకి వెళ్లినా మాకు స్థానిక ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. టీడీపీతోపాటు జనసేన, బీజేపీ శ్రేణులు ప్రచారంలో సంపూర్ణంగా భాగస్వామ్యులవుతున్నాయి. ప్రజలు నన్ను తమ కుటుంబ సభ్యుడిలాగా ఆదరిస్తున్నారు.

● ఎమ్మెల్యే అభివృద్ధి చేశామంటున్నారు..

దగ్గుబాటి: అనంత అర్బన్‌లో ఏ ప్రాంతంలో చూసినా సమస్యలు తాండవిస్తున్నాయి. డ్రైనేజీ, పారిశుధ్యం, రోడ్లు తదితర సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. మీరైనా సమస్యలను పరిష్కరించండి అని అడుగుతున్నారు. టీడీపీ హయాంలో మంజూరైన జాతీయ రహదారి తప్ప.. ఎమ్మెల్యే ఎక్కడ అభివృద్ధి పనులు చేశారో చెప్పగలరా..? గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేకపోయారు. ఏమీ చేయకపోయినా అంతా తామే చేశామని అబద్ధాలు చెబుతున్నారు. ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కుట్ర పన్నుతున్నారు.

● మేనిఫెస్టో విడుదల ప్రభావం ఉందా..?

దగ్గుబాటి: ఇప్పటికే బాబు సూపర్ సిక్స్ పథకాలు జనంలో బాగా నాటుకుపోయాయి. యువతకు ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, మహిళలకు ప్రతి నెల రూ.1500, స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15000, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం.. ఇలా పథకాలన్నీ ప్రజల గుండెలకు హత్తుకుపోయాయి. ఎన్నికల మేనిఫెస్టోపై అన్నివర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మా గెలుపు తథ్యం. మెజార్టీపై దృష్టి పెట్టాం.

● వైసీపీ ఆగడాలను ఏ రకంగా ఎదుర్కొంటారు?

దగ్గుబాటి: ఓటమి భయంలో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తున్నారు. రెండు రోజుల క్రితం జనం చూశారు కదా..? ఏ మాత్రం సంబంధంలేని అంశంలో మా పార్టీ నాయకుడిపై అక్రమ కేసు బనాయించి, అరెస్టు చేశారు. ఎమ్మెల్యేకు డీఎస్పీ, కొందరు సీఐలు తొత్తులుగా పనిచేస్తున్నారు. వైసీపీలో చేరాలని, లేదంటే ఊరు వదిలిపెట్టి వెళ్లాలని టీడీపీ నాయకులను బెదిరిస్తున్నారు. వారి దాడులను, కుట్రలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటాం.

● మిమ్మల్ని గెలిపిస్తే ప్రజలకు ఏం చేస్తారు..?

దగ్గుబాటి: ఇప్పటికే చాలా స్పష్టం చెప్పాం. అధికారంలోకి రాగానే అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేస్తాం. డంపింగ్ యార్డును ఇతర ప్రాంతాలకు తరలిస్తాం. సెజ్‌లు తీసుకొచ్చి పరిశ్రమలు ఏర్పాటు చేసి, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ఔటర్ రింగ్ రోడ్డు, పార్కులను అభివృద్ధి చేస్తాం. పేద ముస్లింలకు ఇళ్ల స్థలాల కోసం 20 ఎకరాలు కేటాయిస్తాం. పేద ముస్లింలకు రుణాలు ఇప్పించి ఆర్థికంగా సహకారం అందిస్తాం. నియోజకవర్గం ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేను అండగా ఉంటాను. అర్ధరాత్రి సమయంలోనూ నా ఇంటి తలుపు తట్టవచ్చు. ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాను.



ఎవరు గెలిచినా మీదే గెలుపు

జిల్లా స్థాయి కూపన్ నెం.2

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ఒకొక్క అసెంబ్లీ స్థానంలో ఎవరు గెలుస్తారు అనేది, మీరు ఊహించిన అభ్యర్థి ఎదురుగా గడిలో టిక్ ✔ మార్క్ చేయండి.

నియోజకవర్గం పేరు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు
1. అనంతపురం అర్బన్				
2. రాప్తాడు				
3. శింగనమల				
4. తాడిపత్రి				
5. గుంతకల్లు				
6. ఉరవకొండ				
7. కళ్యాణదుర్గం				
8. రాయదుర్గం				
9. ధర్మవరం				
10. కదిరి				
11. పుట్టపర్తి				
12. పెనుకొండ				
13. హిందూపురం				
14. మడకశిర				
మొత్తం :				

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 239-2ఎ, బెంగళూరు బైపాస్, కక్కలపల్లి క్రాస్, అనంతపురము- 515001.

షరతులు వర్తిస్తాయి

వైసీపీని 'బజ్జీ'చేసి పొట్లం కట్టేద్దాం..!


బజ్జీలు వేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం రూరల్, మే 3: 'ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని బజ్జీలలాగే సలసల కాగే నూనెలో వేయించి పొట్లం కట్టి పారేద్దాం' అని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా పాపంపేటలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో స్థానికంగా ఓ కొట్టులో బజ్జీలు వేస్తూ.. ప్రచారంలో టీడీపీ జనసేన, బీజేపీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు. మహిళలు తలచుకుంటే ఏమైనా చేయగలరని..అందుకే ఎన్డీయే కూటమి మేనిఫెస్టోలో వారికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టారని ఆమె గుర్తు చేశారు.

రాష్ట్రాన్ని కాపాడేది ఈ సైకిలే..!

హిందూపురం, మే 3: ఆగిపోయిన రాష్ట్రాభివృద్ధి ముందుకు సాగాలన్నా, నిర్వీర్యమైన వ్యవస్థలు నడవాలన్నా ఈ ఎన్నికల్లో సైకిల్ గుర్తుకే ఓటేయాలని తెలుగుదేశంపార్టీ నాయకులు వినూత్న ప్రచారం నిర్వహించారు. శుక్రవారం హిందూపురం పట్టణంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, మురళిస్వామితోపాటు కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వీధుల వెంబడి సైకిల్‌ని ఎత్తుకుని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం అభివృద్ధి చెందాలంటే రెండు ఓట్లు ఈ సైకిల్ గుర్తుకు వేయాలని విజ్ఞప్తి చేశారు.


వీధుల్లో సైకిల్‌ని ఎత్తుకుని వెళ్తూ ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

ఐదేళ్లయినా అక్కడే..!

5 శాతమే పెండింగ్... ముందుకు సాగని వైనం... షాదీఖానా నిర్మాణంలో నిర్లక్ష్యం



కల్లూరులో నిలిచిపోయిన షాదీఖానా

గార్లదిన్నె: జగన్‌రెడ్డి ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో నిండా నిర్లక్ష్యం వహించింది. మండలంలోని కల్లూరులో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చేపట్టిన షాదీఖానా భవన నిర్మాణాన్ని పూర్తి చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. 2018లో ముస్లింల సంక్షేమానికి టీడీపీ నాయకుడు ముంటిమడుగు కేశవరెడ్డి సుమారు రూ.15 లక్షలు సొంత డబ్బుతో స్థలం కొనుగోలు చేసి షాదీఖానా కోసం ఇచ్చారు. షాదీఖానా నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే యామినీబాల రూ. 35 లక్షలు నిధులు మంజూరు చేయించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో 95 శాతం పూర్తయింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే షాదీఖానా భవన నిర్మాణం పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో 5 శాతం పనులు పూర్తి చేయకపోవడంతో ముస్లింలు మండిపడుతున్నారు. షాదీఖానా పనులు పూర్తి చేయకుండా ముస్లింలపై చిన్నచూపు చూస్తున్నారని ఆ వర్గానికి చెందిన పలువురు వైసీపీ ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మైనార్టీలపై వైసీపీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. ముస్లింలకు వైసీపీ మొండిచేయి చూపింది అనేందుకు కల్లూరులోని షాదీఖానానే నిలువెత్తు నిదర్శనమన్నారు. ముస్లింలపై జగన్‌రెడ్డి కపట ప్రేమను కురిపిస్తున్నరని ఆరోపిస్తున్నారు.

ఉద్యోగులకు చుక్కలు

సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.. రోడ్డెక్కించారు
ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులపై వైసీపీ కక్షసాధింపు
మాట మార్చి...మడమ తిప్పిన సీఎం జగన్
గాలిలో కలిసిపోయిన సీపీఎస్ రద్దు హామీ
పీఆర్సీ అమలులో మోసం... బకాయిల చెల్లింపు పట్టని వైనం


శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరాహారదీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు (ఫైల్)



ధర్మవరం, మే 3: అధికారంలోకి రాగానే వారం రోజుల్లోనే సీపీఎస్ రద్దు చేస్తాం.. ఫ్రెండ్లీ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం.. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటాం.. అని గత ఎన్నికల సమయంలో నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం జగన్‌రెడ్డి హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చి...మడమ తిప్పారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకొచ్చారు. ప్రతినెలా పెన్షన్లు, జీతాలకు ఎదురు చూసేలా చేశారు. పీఆర్సీ, డీఏ తదితర బకాయిలతో పాటు సకాలంలో పీఎఫ్ సొమ్మును కూడా చెల్లించకలేకపోయారు. ఎన్నడూ లేనివిధంగా వాటి కోసం రోడ్డెక్కెలా చేశారు. ఆందోళనలు చేసిన వారికి నోటీసులు ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను గృహ నిర్బంధాలు, అక్రమ కేసులు, బైండోవర్‌తో కట్టడి చేశారు. మొత్తంగా వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను కక్ష సాధింపులకు గురిచేసింది.

ఇదీ పరిస్థితి..

శ్రీసత్యసాయి జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయులు సుమారు 20వేలకు పైగా ఉన్నారు. వారు కాకుండా సచివాలయ పరిధిలో ఉద్యోగులు ఉన్నారు. వారంతా గత ఎన్నికల్లో జగన్ మాటలు నమ్మి వైసీపీకి ఓటు వేశారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వారిని అనేక అవమానాలకు గురిచేశారు. ఎన్నికల్లో గెలిచాక సీపీఎస్ రద్దుపై మాట్లాడాలంటే ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ప్రభుత్వం కొలువుదీరిన రెండేళ్ల మౌనంగా ఉన్న ఉద్యోగులు తరువాత ఉద్యమబాట పట్టారు. దీన్ని అడ్డుకునేందుకు అడుగడుగునా ప్రభుత్వం ప్రయత్నించినా ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ పోరాటాన్ని కొనసాగించారు. చివరికి ప్రభుత్వం చర్చలకు పిలిచి జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్) అంటూ కొత్తరాగం అందుకుంది. ఇది కూడా తమను మోసం చేసేదేనంటూ ఉద్యోగులు మళ్లీ ఆందోళనలు కొనసాగించారు. హక్కుల కోసం పోరాడుతున్నవారిపై పరోక్ష రూపంలో వైసీపీ క్షోభ పెట్టింది. గతంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీనే జీతం వచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీన్ మారింది. ప్రతినెలా జీతం ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. విశ్రాంత ఉద్యోగులు కూడా పెన్షన్ కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్నిసార్లు 12వ తేదీ వరకు జీతాలు, పెన్షన్లు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేసింది. ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు ఇప్పించండి మహాప్రభో అంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సి వచ్చింది. బ్యాంకు ఈఎంఐలు సకాలంలో కట్టలేక అవస్థలు పడ్డారు. పెన్షనర్లు వైద్యం, మందులు ఖర్చులకు ఇబ్బందులు పడ్డారు.

- గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై వినతి పత్రం అందించిన వెంటనే వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించే పరిస్థితి ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితి లేకుండా పోయింది. తమ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి పత్రాలు అందించినా స్పందించకపోవడంతో వివిధ రూపాల్లో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు.
- ఉద్యోగులకు జీపీఎస్, డీఏ, పీఆర్సీ, ఏపీజీఎల్ఐ బకాయిలు ఇతర అలవెన్సులు జగన్ ప్రభుత్వం చెల్లించలేదు. ఐదేళ్లగా ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకోలేని పరిస్థితి.
- ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కూడా భారంగా మారింది. నిధులు కేటాయించక పోవడంతో సుద్దముక్కలు, రిజిస్టర్లు, డస్టర్ ఇతర సామాగ్రి కొనుగోలుకు కొందరు ఉపాధ్యాయులు, హెచ్ఎంలు సొంత డబ్బులను వెచ్చించాల్సిన దుస్థితి నెలకొంది. ఏటా సమగ్రశిక్షణ ద్వారా విద్యార్థుల సంఖ్యను బట్టి స్కూళ్లకు నిధులు మంజూరు చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పరిస్థితి లేదు.
- మధ్యాహ్న భోజనం, ఆన్‌లైన్ హాజరు నమోదు, మరుగుదొడ్ల శుభ్రత ఫొటోలు అప్‌లోడ్, నాడు-నేడు పనుల బాధ్యతతో టీచర్లపై పనిభారం పెరిగింది. ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లుల చెల్లింపులు కాకపోవడంతో పలువురు ఉద్యోగులు తమ శుభకార్యాలు, పిల్లల చదువులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

పీఆర్సీ ఇలా..

వైసీపీ ప్రభుత్వం 11వ పీఆర్సీలో ఉద్యోగులను మోసం చేసింది. ఎన్నడూ లేని విధంగా మధ్యంతర భృతి 27 శాతం ఉంటే దాన్ని నాలుగు శాతానికి తగ్గించి 23 శాతం ఫిట్మెంట్ ఇచ్చింది. దీంతో ఐఆర్‌తో తీసుకున్న జీతం కంటే ఫిట్మెంట్‌తో తీసుకున్న జీతం తగ్గిపోయింది. దీనిపై కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పీఆర్సీ సిఫారసు చేసిన పేస్కేలును పూర్తిస్థాయిలో అమలు చేయకుండానే 12వ పీఆర్సీ కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్‌ను వేసినప్పటికీ ఇంతవరకు ఎటువంటి కార్యకలాపాలు చేపట్టలేదు. వాస్తవంగా 2023 జూలై నుంచి కొత్త పీఆర్సీ కమిషన్ అమలు కావాలి. ఇదిలా ఉండగా ప్రతిసారిలానే వైసీపీ ప్రభుత్వం ఐఆర్‌కూ మంగళం పాడేసింది. దీనిపై ఉద్యోగుల సంఘాల నాయకులు నేటికి ఆవేదన చేస్తున్నారు.

మడకశిర నియోజకవర్గంలో రూ. 144 కోట్ల పనులు రద్దు

పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి మారినా అంతే..
జగన్ ప్రభుత్వంలో మరమ్మతులూ కరువే

దారి కష్టాలు తీరేదెన్నడో..?


పూలపల్లి- అగళి రోడ్డు


బండ్రేపల్లి రోడ్డు

మడకశిర, మే 3 : తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో మంజూరు చేసిన పనులను వైసీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేయడంతో పలు రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో ప్రజలు ప్రయాణం సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు. గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధి కి నిధులు మంజూరు చేసి, టెండర్లు, అగ్రిమెంట్లు కూడా పూర్తి చేసింది. పనులు కూడా కొంత మేర జరిగాయి. ప్రభుత్వం మారడంతో 25శాతం లోపు జరిగిన పనులు రద్దు చేసి, 25 శాతం పైబడి జరిగిన పనులు కొనసాగించే విధంగా నిర్ణయం తీసుకుంది. మడకశిర నియోజకవర్గంలో సుమారు రూ.144 కోట్లకు సంబంధించి పనులు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. తర్వాత రోడ్ల అభివృద్ధికి నిధుల మంజూరు చేయలేదు. దీంతో ఆ రోడ్లలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. టీడీపీ ప్రభుత్వం మడకశిర నియోజకవర్గంలోని ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్ల అభివృద్ధికి సుమారు రూ.144 కోట్లు మంజూరు చేసింది. ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.60 కోట్లు మంజూరు కాగా ఇందులో భూసేకరణకు రూ.10 కోట్లు, రోడ్డుకు 50 కోట్లు కేటాయించింది. నియోజకవర్గ పరిధిలో ఆరు రోడ్లకు రూ. 50 కోట్లు, కిరికెర, మోర్‌బాగల్ వయా హేమావతి రోడ్డుకు రూ. 20 కోట్లు కేటాయించింది. అమరాపురం - విరూపసముద్రం రోడ్డుకు రూ.24 కోట్లు నిధులు మంజూరు చేశారు. టెండర్ల ప్రక్రియ ముగిసి పనులు కూడా ప్రారంభించారు. ప్రభుత్వం మారడంతో 25 శాతం లోపు జరిగాయని రూ.144 కోట్ల పనులు రద్దు చేసింది. మూడు సంవత్సరాలు దాటిపోయినా ఇప్పటి వరకు ఆ రోడ్లకు నిధులు మంజూరు కాలేదు. ఆ రోడ్ల నిర్మాణాలు పూర్తయి ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ఉండేదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పూర్తయి ఉంటే మడకశిర రూపురేఖలు మారిపోయి ఉండేవని స్థానికులు అంటున్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి ఆర్ అండ్ బీ పరిధిలోకి పలు రోడ్లను బదలాయించి నాలుగు సంవత్సరాలు దాటిపోయినా తర్వాత వాటి గురించి పట్టించుకోలేదు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. పంచాయతీరాజ్ నుంచి ఆర్‌బీ పరిధిలోకి 258 కిలో మీటర్ల రోడ్లను బదలాయించారు. మడకశిర మండలంలో 70 కిలో మీటర్లు, అగళిలో 60 కి.మీ, రొళ్లలో 50 కి.మీ, గుడిబండలో 40 కి.మీ, అమరాపురం మండలంలో 38 కిలో మీటర్ల రహదారులను ఆర్ అండ్ బీ పరిధిలోకి మార్చారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో ఉన్నప్పుడు మెటల్ వేసి మట్టిని వేశారు. శాఖ మారిందే కానీ రోడ్ల పరిస్థితిలో ఏమాత్రం మార్పు రాలేదు. దీంతో ఆ రోడ్లు వర్షాలకు మరింత దెబ్బతిని గుంతలమయం కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

జగన్‌కు ఓటు వేస్తే నాశనమే

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్


మాట్లాడుతున్న షరీఫ్

పెనుకొండ టౌన్, మే 3: ఈసారి జగన్‌కు ఓటేస్తే మన రాష్ట్రం, మన పిల్లల భవిష్యత్తును నాశనం చేసుకున్నట్లేనని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ అభ్యర్థి సవిత ఆధ్వర్యంలో మైనార్టీల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి షరీఫ్‌తోపాటు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్ పాల్గొని మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని, అందుకే బీజేపీని మైనార్టీలకు బూచిగా చూపిస్తూ డ్రామాలు ఆడుతున్నార న్నారు. పొత్తు కొత్తగా పెట్టుకోలేదని, గతంలోనే పొత్తు కొనసాగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం మైనార్టీలలో అనేకమంది రాజకీయంగా, విద్యా, ఉద్యోగరంగంలో బాగా రాణిస్తున్నారని వారు ఇలాంటి గిమ్మిక్కులు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 120స్థానాల్లో టీడీపీ గెలవడం ఖాయమన్నారు. మిత్ర పక్షాలు 20సీట్లు గెలుస్తాయన్నారు. జూన్ 9న చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నార న్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు దాదు, సామిల్ షౌకత్, బోలోనిస్సార్, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, కేశవయ్య, వెంకటరమణ, రాంపురం సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బీకే, కందికుంట


ఎర్రకవంకపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీకే, పల్లె కిశోర్‌రెడ్డి

ధర్మానికి.. అధర్మానికి యుద్ధం

బీకే పార్థసారథి

కదిరి, మే 3: ప్రస్తుత ఎన్నికల్లో ధర్మానికి, అధర్మానికి యుద్ధం జరుగుతోందని హిందూపురం పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి బీకే పార్థసారధి పేర్కొన్నారు. తలుపుల మండలకేంద్రంలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ తొలుత శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల్లో ధర్మం వైపు టీడీపీ కూటమి ఉందని, అధర్మం వైపు వైసీపీ ఉందని అన్నారు. సీఎం జగన్ ఓటమి భయంతోనే కూటమిపై అపద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. ఇటువంటి అధర్మ ముఖ్యమంత్రిని తరిమికొట్టడానికి ప్రజలు సిద్ధమవ్వాలన్నారు. ఎన్నికల్లో కూటమిని గెలిపించాలని కోరారు. సూపర్ సిక్స్ పథకాలతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను ఎంపీగా, కందికుంట వెంకటప్రసాద్‌ను ఎమ్మెల్యే గెలిపించాలని పిలుపునిచ్చారు. తర్వాత ఆయన పుట్టపర్తి నియోజకవర్గంలోని నల్లమాడ మండలం ఎర్రవకంపల్లిలో యువ నాయకుడు పల్లె కృష్ణకిశోర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. అక్కడ 60కుటుంబాల వారు టీడీపీలోకి చేరారు. వారికి బీకేతో పాటు కృష్ణకిశోర్ రెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం ఓడీసీ మండలం గాజుకుంటపల్లిలో కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి, టీడీపీ గెలుపునకు కృషిచేయాలని, ఉన్న కొద్ది రోజుల్లో కార్యకర్తలు, నాయకులు సమష్టిగా పని చేయాలని సూచించారు.

శంకుస్థాపన సరే.. రోడ్డేదీ..?

అర్ధంతరంగా ఆగిపోయిన రహదారి పనులు



కళ్యాణదుర్గం రూరల్, మే 3: వైసీపీ ప్రభుత్వ అభివృద్ధి పనులు శంకుస్థాపనలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కుందుర్పి మండలం జంబగుంపల గ్రామం నుంచి వెంకటాంపల్లి వరకు తారు రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఉషశ్రీచరణ్ 2020లో శంకుస్థాపన చేసి వదిలేశారు. మూడు కిలోమీటర్లు తారు రోడ్డు కొరకు ఏఐఐబీ నిధులు 401.00 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు గ్రామాల మధ్య రహదారులు సరిగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఈ రెండు గ్రామాల మధ్య వంక ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయన్నారు.


రహదారి సరిగ్గా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

టీడీపీతోనే ముస్లింల సంక్షేమం

కూటమి ఎంపీ అభ్యర్థి అంబికా



మాట్లాడుతున్న అంబికా లక్ష్మీనారాయణ

రాయదుర్గం, మే 3: తెలుగుదేశం పార్టీతోనే ముస్లింల సంక్షేమం సాధ్యమని కూటమి పార్లమెంట్ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం రాయదుర్గంలోని అజీజీయా షాదీమహల్‌లో ముస్లిం మైనార్టీల తో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. రాయదుర్గం నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి శాసనమండలి మాజీ అధ్యక్షులు షరీఫ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా అంబికా మాట్లాడుతూ కేంద్రం సహకారం కోసమే టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకుందన్నారు. బీజేపీ విధానాలు, సిద్ధాంతాలతో తెలుగుదేశం పార్టీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా సామరస్యాన్ని కాపాడే విధంగా లౌకికవాదాన్ని పెంపొందించే విధంగా చంద్రబాబునాయుడు పాలన ఉంటుందని పేర్కొన్నారు. గతంలో పలుసార్లు టీడీపీ బీజేపీతో పొత్తు పెట్టుకున్నప్పటికీ మైనార్టీలకు ఎలాంటి హానీ కలగలేదన్న విషయాన్ని గుర్తు చేశారు. పలు ఆర్థిక నేరాలల్లో 16 నెలలు జైలు శిక్ష అనుభవించిన జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉన్న ల్యాండరింగ్, సీబీఐ కేసుల నుంచి తప్పించుకోవడానికి బీజేపీకి తొత్తుగా వ్యవహరించారని విమర్శించారు. దాదాపు 32 కేసుల్లో నిందితుడిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ జైలు పాలు కావాల్సి వస్తుందన్న నెపంతో ఐదేళ్లపాటు బీజేపీకి సానుకూలంగా వ్యవహరించాడని ధ్వజమెత్తారు. ముస్లింలపై మైనార్టీల సంక్షేమం చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని పేర్కొన్నారు.

పెద్దనోటు ఉన్నింటేనా..!



అనంతపురం రూరల్, మే 3: పెద్ద నోట్ల రద్దు ఎందుకు జరిగిందోగాని.. ఆ నోటే ఉండింటే చాలా సమస్యలు తీరేవి అనుకుంటున్నారు జనం. ప్రచార సమయంలో నాయకుడు డబ్బులు తీస్తే.. అతడి వంక ఎగాదిగా చూస్తున్నారు. ఆయన వంద, రెండువందలు, ఐదు వందల నోట్లు ఎన్నిస్తారో తెలీదు. వంద నోట్లు పది ఇచ్చిన వెయ్యి దాటదు. రెండు వందల నోట్లు ఐదు ఇచ్చినా, లేక ఐదు వందల నోట్లు రెండించిన ఇంతేనా అన్నట్లుంది. అదే రెండువేల నోటు ఉండింటే..ఆ కథే వేరుగా ఉండేదంటున్నారు. నాయకుడు ఇవ్వననలేడు, లేదని చెప్పలేడు. ఇచ్చినా చిల్లర ఇవ్వమని అడగలేడు. ఆ నోటు ఒకటిచ్చినా ఆ రోజుకు పండగే. నాయకులకు కూడా చిన్న నోట్లతో చిక్కులు తప్పడం లేదు. రెండు వేల నోటు ఉండింటే వంద మందికి రెండు వేల చొప్పున చెట్టు కిందో..ఏదో సందులోనో యాడో చోటో రెండు కట్టలు అలా పంచేసి చేతులు దులిపేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రూ.500 నోటుతో వంద మందికి పంపిణీ చేయాలన్నా.. నాలుగు కట్టలు జేబులో పెట్టుకోవాలి. ఎవడు ఎక్కడి నుంచి వస్తాడో తెలీదు. ఎప్పుడు ఎలా పంచాలో తెలియక, ఏం జరుగుతుందోనన్న టెన్షన్‌తో ఇబ్బంది పడుతున్నారు.

గుడ్డిగా నమ్మి ఓట్లేశాం

- నారాయణస్వామి



జగన్ సీఎం అయితే మాకు ఇల్లు వస్తుందని గుడ్డిగా నమ్మి ఓట్లు వేశాం. కానీ జగన్ ఐదేళ్ల పాలనలో ఇంటి హామీ నెరవేరలేదు. గత ఎన్నికలప్పుడు కొందరు వైసీపీ వాళ్లు మాఇంటి వద్దకు వచ్చి మాకు ఈసారి ఒక్కసారి ఓట్లు వేయండి. మీ ఇద్దరు కుమారులకు ఇళ్లు ఇప్పిస్తామన్నారు. ఐదేళ్ల గడిచిన మాకు ఇళ్లు ఇవ్వలేదు. 20 రోజులు కిందట శ్మశానంలో ఒకరికి రెండ్లు సెంట్ల పట్టా ఇచ్చినట్లు పేపర్లు ఇచ్చారు. నేను, నా కొడుకులు బాడుగ ఇంటిలోనే ఉన్నాము. జగన్ వస్తే మాటామీద నిలబడుతాడు అన్నారు. మరి ఏదీ? ఈ ఎలక్షన్లలో మాత్రం రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే చంద్రన్నకు ఓట్లు వేస్తాము. పింఛన్ కూడా రూ.4వేలు అంటున్నాడు కదా.

- శింగనమల

ఇచ్చిన మాట తప్పేవారు కాదు

- దండు నారాయణస్వామి, పెద్దమట్లగొంది



అప్పట్లో ఎన్నికలు వచ్చాయంటే ప్రచారానికి వచ్చిన అభ్యర్థి మాట ఇస్తే తప్పేవారు కాదు. గెలిచాక గ్రామానికి వచ్చి పెద్దలకు హామీ ఇచ్చిన మేరకు పనులు పూర్తి చేసేవారు. 50 ఏండ్ల కిందట నాకు ఓటు హక్కు వచ్చింది. అప్పటి ఎలక్షన్‌లో అభ్యర్థి గ్రామంలో ప్రచారం చేయడానికి ఎద్దుల బండి మీద వచ్చాడు. గుడిలో అందరూ గ్రామస్థులు ఒక తెల్ల పేపర్ మీద రాసి ఇచ్చారు. రెండు నెలలు తరువాత గెలిచిన వ్యక్తి వచ్చి మా ఊరి రోడ్డుకు ఇరువైపుల మట్టి తొలించారు. గ్రామస్థులు అందరూ ఆయన్ను ఎద్దుల బండి మీద ఊరేగించారు. ఇప్పటి ఎలక్షన్ స్వార్థపూరితంగా ఉన్నాయి. ఎలక్షన్ అంటే మద్యం, డిన్నర్లు పెట్టి, దబ్బ ఇచ్చి తమ వైపునకు తిప్పుకుంటున్నారు. గెలిచాక గ్రామం వైపు తొక్కి తొంగిచూడరు.

- శింగనమల

రచ్చబండ రాజకీయమే శాసనం



అప్పట్లో ప్రతి గ్రామానికి రచ్చబండ అని ఒకటుండేది. అక్కడే ఏదైనా పంచాయితీ కానీ, నిర్ణయాలు కానీ చేసేవారు. అక్కడి నిర్ణయాలు శాసనంగా అమలయ్యేవి. అక్కడ రాజకీయంగా కూడా ఓ నిర్ణయం తీసుకున్నా, గ్రామస్థులందరూ దానికే కట్టుబడి ఉండేవారు. గ్రామానికి ఎవరైనా అధికారులు వచ్చినా సరే రచ్చబండ వద్దే సమావేశాలు ఏర్పాటు చేసి, చర్చించేవారు. అంతటి ప్రాధాన్యం ఉన్న రచ్చబండ రాజకీయానికి నూకలు చెల్లిపోయాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడంతో వీటి పట్ల ఆసక్త చూపేవారే కనుమరుగయ్యారు.

- కళ్యాణదుర్గం

చిర్రెత్తిస్తున్న ఫోన్‌కాల్స్

సోషల్ మీడియాలో ప్రధాన పార్టీల ప్రచారాల జోరు

పదునైన విమర్శలు చేసుకుంటున్న వైనం



కొత్తచెరువు, మే 3 : సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈనెల 13న శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. శ్రీసత్యసాయిజిల్లాలో ఆరు అసెంబ్లీ స్థానాలకు గాను 78 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒక ఎంపీ స్థానానికి 13 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, స్వతంత్రులు ప్రజల మద్దతు పొందేందుకు ఎవరికి తోచిన రీతిలో వారు ప్రచారాలను నిర్వహిస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు సోషల్ మీడియా ద్వారా ఒకరిపై ఒకరు పదునైనా విమర్శలు చేసుకుంటూ హోరెత్తిస్తున్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ, కాంగ్రెస్.. ఇటీవల విడుదల చేసిన మేనిఫెస్టోలను ప్రజలకు తెలియజేసేందుకు వాహనాలకు పెద్దపెద్ద డిజిటల్ టీవీ స్క్రీన్లను ఏర్పాటుచేసి జనసముహం ఉన్నప్రాంతాల్లో ప్రదర్శిస్తున్నాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరు స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నారు. ఈ ఎన్నికలలో ప్రధాన పార్టీల అభ్యర్థులు సెల్‌ఫోన్లను ప్రచార అస్త్రాలుగా వినియోగించుకుంటున్నారు. 'నేను మీ పలాన పార్టీ అభ్యర్థిని.. ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో మీరు నాకు ఓటు వేసి ఆశీర్వదించాలి.. ఇట్లు మీ బిడ్డ, మీ నాయకుడు' అంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఫోన్ ఎత్తితే ఇదే గోల. ఈ ప్రచారాలతో జనాలు చిరైత్తుతున్నారు.

నేను మీ సైకిల్ గుర్తును..



వాహనం పై ఉన్న సైకిల్

అనంతపురం రూరల్, మే 3: ఎన్నికల ప్రచారంలో సైకిల్ జనాన్ని ఆకట్టుకుంటోంది. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలో శుక్రవారం ఓ వాహనంపై సైకిల్‌ను ఆకర్షణీయంగా ఉంచి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కాలనీలోని వీధుల్లో ఇంటింటి ప్రచారంలో నేను టీడీపీ గుర్తును..ఈ గుర్తు పోలింగ్ బూత్‌లోని ఓటింగ్ మెషీన్‌లో రెండు చోట్ల కనిపిస్తాను. ఒకటి ఎమ్మెల్యే అభ్యర్థి ఓటింగ్ మెషీన్, మరొకటి ఎంపీ అభ్యర్థి ఓటింగ్ మెషీన్‌లో మీకు తారసపడుతాను. నేను కనిపించగానే అమాంతం బటన్ నొక్కేయండీ అంటూ ఈ సైకిల్ తన ప్రచారాన్ని సాగించింది. ప్రజలు ప్రచారంలోని ప్రచారాన్ని చూస్తూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

మాజీ ఎమ్మెల్యే యామినిబాల టీడీపీలోకి చేరిక



చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరిన మాజీ ఎమ్మెల్యే యామినిబాల

శింగనమల మే3: శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినిబాల టీడీపీలో చేశారు. ఇటీవల ఆమె వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం చీరాలలో ఆమె టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో పసుపు కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరలా సొంత గూటికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయమని చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు.

ఎప్పుడు కూలుతుందో.. ఏమో..!

బొమ్మనహాళ్, మే 3: తాము అధికారంలోకి వస్తే డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తామన్నారు. కానీ ఉన్నవాటికి కనీసం మరమ్మతులు చేయించలేని దుస్థితిలో వైసీపీ పాలకులు ఉండిపోయారు. మండల కేంద్రంలోని గ్రంథాలయం ఎప్పుడు కూలుతుందోనన్న స్థితిలో ఉంది. దీంతో నిత్యం గ్రంథాలయానికి వచ్చే పాఠకులు భయాందోళన చెందుతున్నారు. కొంతమంది రావడం మానేశారు. అధికారులు పలుమార్లు శిథిలభవనాన్ని చూసి వెళుతున్నారే తప్ప కనీసం భవనానికి మరమ్మతులు చేయించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గదులతో పాటు వరండా పూర్తిగా దెబ్బతింది. స్లాబు దెబ్బతిని ఇనుప కమ్మీలు బయటపడి పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఇక వర్షం వస్తే గదుల్లో ఉన్న పుస్తకాలు, పత్రికలు తడిసి ముద్దవుతాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీకో డిజిటల్ లైబ్రరీ(గ్రంథాలయం) నిర్మాణం చేస్తామని హామీలు ఇచ్చారు. అవి ఇప్పటికీ నిర్మాణాలకు నోచుకోలేదు.



శిథిలావస్థకు చేరుకొన్న బొమ్మనహాళ్ గ్రంథాలయం



అటు కర్ణాటక.. ఇటు కడప.. చిత్తూరు జిల్లాల సరిహద్దులోని కదిరి ప్రాంతం చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోంది. వ్యవసాయమే ఇక్కడ జీవనాధారం. నిత్యకరువులతో వ్యవసాయం కుదేలయింది. భూస్వామ్య వ్యవస్థ వేళ్లూనుకుపోయిన ఈ ప్రాంతం.. అనేక విప్లవాలకు పురుడు పోసుకుంది. ప్రజాకవి యోగివేమన తన కలంతో సమాజంలో పేరుకుపోయిన మూఢత్వాన్ని చీల్చిచెండాడాడు. ఎస్‌ఏ రవూఫ్ లాంటి విప్లవ నాయకులను అందించిన గడ్డ ఇది. ఖాద్రీ నృసింహుడి ఆలయం ఈ ప్రాంతానికే మకుటాయమానం. పాలకులు ఎందరు మారినా ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారించలేదు. దీంతో అనేక సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి.



చైతన్యానికి ప్రతీక

వ్యవసాయమే జీవనాధారం
నిత్యకరువులతో వ్యవసాయం కుదేలు
వలసబాటలో రైతులు, కూలీలు
కదిరి నియోజకవర్గ అభివృద్ధి పట్టని పాలకులు

కదిరి, మే 3 : కదిరి పేరు వింటేనే గుర్తు వచ్చేది ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి. ఖాద్రీ వృక్షాలు ఎక్కువగా ఉండడం వల్ల మొదట ఖాద్రీగా కాలక్రమేణా కదిరిగా పేరు వచ్చింది. 1910లో కదిరి తాలూకా కడప జిల్లా నుంచి విడిపోయి అనంతపురం జిల్లాలో కలిసింది. రాష్ట్రంలోనే అతి పెద్ద తాలూకాగా పేరుగాంచింది. గతంలో 10మండలాలు కలసి కదిరి తాలూకాగా ఉండేది. కదిరికి కరువుకు విడదీయరాని బంధం ఉంది. అనేక సంవత్సరాలుగా కరువు కదిరి ప్రాంతంలో తిష్టవేసింది. ఉపాధికి ఎటువంటి పరిశ్రమలు లేవు. వర్షాధార పంటలే జీవనాధారం. ఇందులో వేరుశనగ ముఖ్యమైనంది. వేరుశనగ పంటకాలం పూర్తయితే ఇక్కడి రైతులందరూ కూలీలే. ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకుని 20 ఎకరాల ఆసామి కూడా వలస వెళ్లాల్సిందే. కదిరి నుంచి బెంగళూరు నగరంలో వలస కూలీలుంటున్న హోంగసంద్ర అనే ప్రాంతానికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారంటే వలసలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామితోపాటు ఇక్కడ కొన్ని పుణ్యక్షేత్రలు, దర్శనీయ స్థలాలున్నాయి. కదిరి మల్లెలలకు రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానముంది.

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కదిరి పేరు వింటేనే ప్రసిద్ధి చెందిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం గుర్తుకు వస్తుంది. ఇక్కడ ప్రహ్లాద సమేత లక్ష్మీ నరసింహస్వామి భక్తులకు దర్శనమిస్తారు. ఉగ్రరూపంలో ఉండే లక్ష్మీనరసింహస్వామి కదిరిలో ప్రశాంత లక్ష్మీనారాసింహుడుగా దర్శనమిస్తారు. ప్రతి సంవత్సరం శ్రీవారి బ్రహ్మోత్సవాలు 15 రోజుల పాటు బ్రహ్మాండంగా నిర్వహిస్తారు. రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా తరలి వస్తారు.


1952నుంచి గెలిచిన ఎమ్మెల్యేల వివరాలు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	మెజార్టీ
1952	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	5,273
1955	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	1,063
1962	ఇ.గోపాల్‌నాయక్	కాంగ్రెస్	1,076
1967	కేవీ వేమారెడ్డి	కాంగ్రెస్	13,097
1972	సి.నారాయణరెడ్డి	ఇండిపెండెంట్	2,002
1978	నిజాంవలీ	కాంగ్రెస్	15,808
1983	మహహ్మద్‌షాకీర్	టీడీపీ	21,457
1985	సీహెచ్ అబ్దుల్‌రసూల్	టీడీపీ	10,928
1989	మహమ్మద్‌షాకీర్	కాంగ్రెస్	18,275
1994	జొన్నా సూర్యనారాయణ	టీడీపీ	55,231
1999	ఎంఎస్ పార్థసారధి	బీజేపీ	9,770
2004	జొన్నారామయ్య	కాంగ్రెస్	8,938
2009	కందికుంట వెంకటప్రసాద్	టీడీపీ	14,977
2014	అత్తార్ చాంద్‌బాషా	వైసీపీ	968
2019	డాక్టర్ పీవీ సిద్దారెడ్డి	వైసీపీ	27,243

కదిరి నియోజకవర్గ చరిత్ర

కదిరి నియోజకవర్గం 1952లో ఏర్పడింది. 2009లో నియోజవర్గాల పునర్విభజన తరువాత కదిరి, తలుపుల, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట, నంబులపూలకుంట మండలాలను కదిరి నియోజకవర్గంగా విభజించారు. నియోజవర్గ ఓటర్ల సంఖ్య 2,50,776. వీరిలో పురుషులు 1,23,742, మహిళలు 1,27,027 మంది ఉన్నారు. కదిరి మున్సిపాలిటీ ఉంది. అత్యధికంగా ఇక్కడ మైనార్టీ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం 1962లో ఎస్టీకి రిజర్వు అయింది. 1952 నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో 15 సార్లు ఎన్నికలు జరిగాయి. ఏడుసార్లు కాంగ్రెస్, మూడుసార్లు టీడీపీ, రెండుసార్లు వైసీపీ, ఒక్కోసారి బీజేపీ, ఇండిపెండింట్ గెలిచారు. మొదటిసారి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన కేవీ వేమారెడ్డి 5,273 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆయన అసెంబ్లీ స్పీకర్‌గా కూడా పనిచేశారు. 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి జొన్నా సూర్యనారాయణ కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ షాకీర్‌పై 55,231 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

తొలి ఎమ్మెల్యే వేమారెడ్డి



కదిరి నియోజకవర్గానికి మొదటి శాసనసభ సభ్యుడిగా కదిరి మున్సిపాలిటీలోని కుటాగుళ్లకు చెందిన కేవి వేమారెడ్డి ఎన్నికయ్యారు. 1952 నుంచి 1962 వరకు ఆయన ఎమ్మెల్యే పనిచేశారు. తరువాత 1967 నుంచి 1972 వరకు శాసనసభ్యుడిగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా 1971లో నవంబరు 25న ఎన్నికయ్యారు. 1972 మార్చి 19వరకు ఆ పదవిలో ఉన్నారు

ఇప్పటి వరకు నియోజవర్గ చరిత్రలో ఇదే అత్యధికం. 2014 ఎన్నికల్లో అత్తార్ చాంద్‌బాషా తన సమీప ప్రత్యర్థి కందికుంట వెంకటప్రసాద్‌పై 968 ఓట్లతో గెలిచారు. ఇదే అత్యల్ప మెజార్టీ.

కటారుపల్లిలో యోగి వేమన సమాధి

మూఢ నమ్మకాలను తన పద్యాలతో ప్రశ్నించిన మహాకవి యోగివేమన సమాధి గాండ్లపెంట మండలం కటారుపల్లిలో ఉంది. ఇక్కడ యోగివేమన జీవ సమాధి అయినట్లు చరిత్ర చెబుతోంది. పల్నాడు జిల్లా కొండవీడు ప్రాంతం నుంచి యోగివేమన ఒం టరిగా కటారుపల్లికి వలస వచ్చారు. ప్రతి సంవత్సరం ఇక్కడ వేమన తిరుణాల నిర్వహిస్తుంటారు.

బట్రేపల్లి జలపాతం

తలుపుల మండలంలోని బట్రేపల్లికి సమీపంలో ఉండే అటవీ ప్రాంతంలో జలపాతం ఉంది. కదిరి - పులివెందుల రోడ్డుకు సమీపంలో ఎత్తయిన కొండపై నుంచి నీటి ప్రవాహం వాలు జారుతుంది. ఈ జలపాతం వర్షాకాలంలో దాదాపు మూడు నెలల పాటు పర్యాటకులకు కనువిందు చేస్తుంది.

విప్లవయోధుడు రవూఫ్



కదిరి ప్రాంతం చైతన్యానికి మారుపేరు. కదిరి మున్సిపాలిటీలోని కుటాగుళ్ల విప్లవాల గడ్డగా పేరుంది. కుటాగుళ్ల విప్లవయోధుడు రవూఫ్ జన్మస్థలం. ఆయన నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం. కదిరి ప్రాంత సమస్యలపై నిరంతర పోరాటం చేశారు. విద్యావంతుడైన రవూఫ్ ప్రజాన్యాయవాదిగా పేరొందాడు. కమ్యూనిస్టు రాజకీయాల వైపు మొగ్గు చూపిన ఆయన.. తొలుత సీపీఐలో తర్వాత సీపీఎంలో పనిచేశారు. తరువాత సీపీఎం నుంచి సీపీఐ ఎంఎల్‌గా విడిపోయినపుడు ఆయన కూడా ఎంఎల్ పార్టీలోకి వెళ్లారు. అప్పటి నుంచి దేశంలో వివిధ ప్రాంతాల్లో చారుమజుందార్ వంటి వారితో కలిసి విప్లవ ఉద్యమాల్లో పాల్గొన్నారు. చనిపోయేంతవరకు కమ్యూనిస్టుగా, నిస్వార్థపరుడిగా జీవితాన్ని గడిపారు.

ప్రధాన సమస్యలు..

కదిరి నియోజకవర్గం ముఖ్యంగా వ్యవసాయంపై అధారపడింది. సాగు నీరు ఇక్కడ ప్రధాన సమస్య. ఎలాంటి సాగునీటి సదుపాయం లేదు. నియోజవర్గంలో దాదాపు 100 చెరువులకు పైగా ఉన్నాయి. నదులు లేక పోవడంతో వ్యవసాయమంతా భూగర్భ జలాలపైనే అధార పడి ఉంది. హంద్రీనీవా ద్వారా చెరువులకు నీళ్ల అందిస్తామని వైసీపీ హామీలు ఇచ్చింది కానీ ఎలాంటి పనులు చేపట్టలేదు. 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పనులు అలాగే ఉండిపోయాయి. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా కదిరి, తలుపుల, నంబులపూలకుంట మండలాలకు నీళ్లు అందాల్సి ఉంది. అదే విధంగా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ ద్వారా కదిరి, తనకల్లు, నల్లచెరువు, గాండ్లపెంట మండలాలు నీళ్లు చేరాల్సి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలతున్నా హంద్రీనీవా పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించలేదు. హంద్రీనీవా ద్వారా నీరు అందిస్తే వేలాది ఎకరాలు సస్యశ్యామలమవుతాయి.

- కదిరి నియోజవర్గంలో కరువు నిత్యం ఉంటుంది. ఉపాధి కోసం అన్ని వయసుల వారు వలసలు వెళుతుంటారు. ఉపాధినిచ్చే పరిశ్రమలు ఒక్కటీ లేవు. చదువుకున్నవారు, చదువు లేని వారు బెంగళూరు, తిరుపతి, హైదరాబాదు వంటి నగరాలకు నిత్యం వలస వెళుతుంటారు.
- ఈ ప్రాంతంలో వేరుశనగ, టమోట అత్యధికంగా పండిస్తారు. వీటికి గిట్టుబాటు ధర లేక ఆదర ణ కరువయింది. వేరుశనగ విస్తీర్ణం తగ్గుతోంది. వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.
- పర్యాటక రంగం పూర్తి నిర్లక్ష్యానికి గురయింది. ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం, తిమ్మమ్మమర్రిమాను, యోగివేమన సమాధి ఉన్న కటారుపల్లిలో, బట్రేపల్లి జలపాతం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదు. పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేస్తే కదిరి అభివృద్ధి చెందుతుంది.
- కదిరి పట్టణంలో దాదాపు 10 వేల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారు. నిత్యం అనేక జబ్బులతో సతమతమవుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా ఈఎస్ఐ ఆసుపత్రి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రతి ఎన్నికకు ఇదే వాగ్దానంగా మిగిలిపోతోంది.
- కదిరి పట్టణంలో దాదాపు 1.20 లక్షల మంది జనాభా ఉన్నారు. అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో పాటు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వాటి బాగు చేయాలని ప్రజలు కోరతున్నారు. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని వైసీపీ ఇచ్చిన హామీ నేరవేరలేదు.



తిమ్మమ్మ మర్రిమాను

గిన్నిస్ రికార్డులకెక్కిన తిమ్మమ్మమర్రిమాను

ప్రపంచంలో కెల్లా అతి ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న మర్రిచెట్టుగా నంబులపూలకుంట మండలం గూటిబైలు గ్రామంలో ఉండే తిమ్మమ్మ మర్రిమాను ప్రసిద్ధి చెందినది. ఇది దాదాపు 7.6 ఎకరాలకు పైగా విస్తరించించి ఉంది. తిమ్మమాంబ చనిపోయే ముందు ఈశాన్య దిక్కులో నాటిన మర్రి మొక్క నేడు మహావృక్షం అయిందని చరిత్ర చెబుతోంది. 1989 డిసెంబర్ 19న గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోకి ఎక్కింది.

నియోజకవర్గంలో మండలాల వారిగా ఓట్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
కదిరి అర్బన్	38,731	40,900	03	79,834
కదిరి రూరల్	13,215	13,559	01	26,775
తలుపుల	16,786	16,845	01	33,632
నంబులపూలకుంట	12,161	12,120	00	24,281
గాండ్లపెంట	10,584	10,786	02	21,372
తనకల్లు	19,992	20,175	00	40,167
నల్లచెరువు	12,273	12,642	00	24,915
మొత్తం	1,23,742	1,27,027	07	2,50,776

కదిరి-6 వేరుశనగకు జాతీయ గుర్తింపు



ఉమ్మడి అనంతపురం జిల్లాలో వే రుశనగ ఎక్కువగా సాగుచేసే ది కదిరి పూర్వపు తాలూకాలోనే. దాదాపు 8 లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. వేరుశనగ రకాలను అభివృద్ధి చేయడానికి ప్రాంతీయ వ్యసాయ పరిశోదన స్థానాన్ని 1959 సంవత్సరంలో ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి 14 వేరుశనగ రకాలను అభివృద్ధి చేశారు. ముఖ్యంగా కదిరి పేరుతో అనేక రకాలు వచ్చాయి. వాటిలో క దిరి - 6 (కె6) వేరుశనగ రకం ఎంతో ప్రఖ్యాతి చెందింది. 1993 లో జా తీయ స్థాయి గుర్తింపు పొందింది. దేశంలోని విత్తనోత్పత్తిలో 50 నుంచి 60 శాతం వర కు విత్తన కాయలు ఇక్కడ ఉత్పత్తి చేస్తున్నారు.



నీళ్లు రాని హంద్రీనీవా కాలువ

సోలార్ హబ్‌గా నంబులపూలకుంట



కదిరి నియోజకవర్గంలోని నంబులపూలకుంట మండల కేంద్రంలో సోలార్‌హబ్‌ను ఏర్పాటుచేశారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి నంబులపూలకుంటలో ప్రభుత్వ భూముల్లో యురేనియం డంపింగ్ యార్డు నిర్మాణానికి అనుమతినిచ్చారు. దాన్ని తీవ్ర స్థాయిలో ప్రస్తుత ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ వ్యతిరేకించి భారీ ఉద్యమాన్ని నడిపారు. చివరకు రాకుండా చేశారు. ఆ తరువాత సోలార్‌హబ్ ఏర్పాటుకు కృషి చేశారు. ప్రస్తుతం 750 మెగావాట్ల విద్యుత్ ఇక్కడ ఉత్పత్తి అవుతోంది. వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తోంది.

కళా ప్రదర్శనల ద్వారా ఓటు హక్కుపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, మే 3: కళాప్రదర్శన ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. స్వీప్ జిల్లా నోడల్ అధికారి జడ్పీ డిప్యూటీ సీఈఓ లలితాబాయి, అర్బన్ నోడల్ అధికారి డిప్యూటీ తాహసీల్దార్ పద్మావతి ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని టవర్‌క్లాక్, ఆర్ట్స్ కళాశాల, సప్తగిరి ప్రధాన కూడళ్లలో ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించేలా కళాప్రదర్శనలు, ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు తెలుసుకో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకో.. అంటూ నినాదాలు చేశారు. జాతీయ జెండా ప్రదర్శన, ప్రజాస్వామ్య విలువల్లో ఓటు హక్కు ప్రధాన భూమిక పోషిస్తుందని వారు వివరించారు. కాగా ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు బృందం ఆధ్వర్యంలో చేసిన నృత్య, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



స్వీప్ ఆధ్వర్యంలో ర్యాలీ

జగన్‌రెడ్డీ.. పింఛన్‌దారులపై కుట్రలు ఆపండి





ప్రచారంలో పాల్గొన్న దగ్గుబాటి ప్రసాద్, టీడీపీలో చేరిన భగత్ సింగ్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకుడు డిష్ గోపాల్, వైసీపీ కార్యకర్తలు

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, మే 3 : జగన్‌రెడ్డీ... పింఛన్‌దారులపై కుట్రలు ఆపాలని కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక 4, 5 వ డివిజన్లల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక టీడీపీ, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొన్ని చోట్ల మహిళలు హారతులు పట్టారు. ఆయా కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పలువురు వృద్ధులు తమ పింఛన్ డబ్బులు బ్యాంకుల్లో జమ చేయడంతో పడే ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దగ్గుబాటి ప్రసాద్ మాట్లాడుతూ... వృద్ధులను ఇబ్బంది పెట్టేందుకే బ్యాంకుల్లో డబ్బులు జమ చేయించారన్నారు. సచివాలయ ఉద్యోగులతో ఇంటి వద్దకే వెళ్లి ఎందుకు పింఛన్ సొమ్ము అందజేయలేదని నిలదీశారు. కుట్ర పూరితంగా బ్యాంకుల్లో డబ్బులు జమ చేసి వృద్ధులు బ్యాంకుల వద్ద పడిగాపులు కాసేలా చేయడం దుర్మార్గమన్నారు. పైగా ఆ నెపాన్ని టీడీపీపై నెడుతూ నీచరాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. గత నెలలో పింఛన్ల పంపిణీలో అస్తవ్యస్తంతో 33 మంది మరణానికి జగన్ సర్కార్ కారణమైందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు వెంకటాద్రి, కృష్ణం రఘు, ముక్తియార్, ఫిరోజ్, జయప్రకాష్ పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగిన చేరికలు: దగ్గుబాటి సమక్షంలో రాజీవ్ కాలనీ పంచాయతీ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు డిష్ గోపాల్‌తోపాటు 30 మంది నాయకులు టీడీపీలో చేరారు.

ప్రముఖుల ప్రచారం: దగ్గుబాటి శ్రీ లక్ష్మి స్థానిక 3, 22, 24వ డివిజన్లల్లోని కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. అలాగే 8వ డివిజన్‌లో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, 13వ డివిజన్‌లో కురబ నారాయణ స్వామి, చెరుకూరి శివ, 39వ డివిజన్‌లో చేపల హరి, కొండవీటి భావన, నరేంద్రకుమార్, 42వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ విజయశ్రీరెడ్డి, ఇస్మాయిల్, శ్రీనివాసరెడ్డిలు ప్రచారం చేశారు.

దగ్గుబాటిని గెలిపిద్దాం... : జగన్ ఓడిద్దాం.. చంద్రబాబును మళ్లీ రప్పిం చేందుకు కృషి చేద్దామని రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో



దగ్గుబాటి శ్రీలక్ష్మి ప్రచారం

దగ్గుబాటి ప్రసాద్‌తో కలిసి అఖిల భారత రాష్ట్ర పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, సామాన్య ప్రజానీ కాన్ని నడ్డి విరిచిన జగన్ ప్రభుత్వాన్ని చిత్తుగా ఓడించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన పీఆర్సీ, డీఏలు, జీపీఎఫ్, మెడికల్ బిల్లులు బకాయిలు రూ.30వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు గురవయ్య మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల సబ్ ప్లాన్ నిధులు మళ్లించి ఆ వర్గాలకు సీఎం జగన్ ద్రోహం చేశారన్నారు. దళితులకు 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి తీరని అన్యాయం చేశారన్నారు. అనంత అర్బన్‌లో కూటమి అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు విజేడం చౌదరి, ఎన్జీవో సంఘం మాజీ నాయకులు నరసయ్య, జయప్ప పాల్గొన్నారు.

రూరల్ మండలాల్లో ప్రచారం

అనంతపురంరూరల్: మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డి పల్లి, నారాయణపురంలో దగ్గుబాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్ చార్జ్ డిష్ నాగరాజు, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, గ్రామ మాజీ వైస్ సర్పంచు ఓబుళపతి, మాజీ ఎంపీటీసీ నాగరాజు, తెలుగు రైతు రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ రాయల్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులూ.. ఆలోచించి ఓటెయ్యండి..!

కూటమి రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి పరిటాల సునీత

అనంతపురంరూరల్, మే 3: 'వైసీపీ పాలనలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మి కులు, పింఛన్‌దారులకు చాలా అవమానం జరిగింది. టీడీపీ అధికారంలోకి రాగానే మీరు ఎక్కడైతే అవమానించబడ్డారో.. అక్కడే గౌరవం దక్కేలా చేస్తాం..' అని మాజీ మంత్రి పరిటాల సునీత హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని కక్కలపల్లి కాలనీ, పాపంపేట పంచాయతీ పరిధిలోని ప్రాంతాల్లో ఆమె విస్తృత ప్రచారం చేపట్టారు. ఆమె మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. టీడీపీ హయాంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఒకటో తేదీనే వేతనాలు, పింఛన్లు అందేవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 20వతేది వచ్చిన వేతనాలు అందేపరిస్థితిలేదన్నారు. న్యాయమైన హక్కుల కోసం ప్రభుత్వం వద్దకు వెళ్తే అవమా నించారన్నారు. కనీసం జగన్ వీరితో మాట్లాడే పరిస్థితి కూడా లేదన్నారు. టీడీపీ స్పష్టంగా ఉద్యోగులు, పెన్షనర్లకు హామీలు ఇచ్చింద న్నారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరుగు తోందని, ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, కాపుకార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పాముురాయి వెంకటేష్, జనసేన రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు సాకే పవన్ కుమార్, మండల మాజీ కన్వీనర్ చల్లా జయ కృష్ణ, ఎంపీటీసీ రత్నమ్మ పాల్గొన్నారు.

ప్రకాష్.. చేతనైతే వలసలు ఆపుకో..

చేతనైతే వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలను ఆపుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డికి పరిటాల సునీత సవాల్ విసిరారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో 90కుటుంబాలు వైసీపీలో నుంచి టీడీపీలోకి చేరాయి. ఆత్మకూరు మండలం పి.యాలేరు నుంచి 18 కుటుంబాలు, వై.కొత్తపల్లి నుంచి రెండు కుటుంబాలు, కనగానపల్లి మండలం కోనాపురం నుంచి 11 కుటుంబాలు, తగరకుంటకు చెందిన ఐదు కుటుంబాలు, చెన్నేకొత్తపల్లి



పిల్లిగుండ్ల కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

మండలం ప్యాదిండి గ్రామం నుంచి 11 కుటుంబాలు, రామగిరి మండలం దుబ్బార్లపల్లి నుంచి ఒకరు, పెద్ద కొండాపురం నుంచి ఐదు కుటుంబాలు పార్టీలోకి చేరాయి. అలాగే పరిటాల సిద్ధార్థ సమక్షంలో అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి గ్రామం నుంచి 20 కుటుంబాలు, కనగానపల్లి మండలం నరసంపల్లి నుంచి 11 కుటుంబాలు పార్టీలోకి చేరారు.


పరిటాల సునీత మాట్లాడుతూ.. ఎన్నికలకు ఇక పదిరోజులు కూడా గడువులేదని.. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు అనుక్షణం ప్రజల మధ్యనే ఉండాలని అన్నారు. వీలైనంత మందిని టీడీపీ వైపు వచ్చేలా చేయాలన్నారు. కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎమ్మెల్యే సోదరులు బెదిరింపులు మానేసి.. సొంత పార్టీ నాయకులకు ఇప్పుడైనా న్యాయం చేయాలన్నారు. పార్టీని కాపాడుకోలేని వారు..ప్రజలకు ఏం న్యాయం చేస్తారంటూ విమర్శించారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని పులేటిపల్లి, కోటంపల్లి, నరసింగరాయునపల్లి, ఓబుళం పల్లి, ప్రసన్నాయపేట, ఆమిదాలకుంట, కనుముక్కల, మేడాపురం గ్రామాల్లో పరిటాల సునీత శనివారం ప్రచారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రచారం ఉదయం 8గంటలకు ప్రారంభం అవుతుందన్నారు.

కుటుంబ సభ్యుల ప్రచారం

రాప్తాడు : రాప్తాడులో శుక్రవారం పరిటాల కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, ఆయన సతీమణి ధర్మవరపు ధనలక్ష్మి, కుమారుడు ధర్మవరపు చేతన్, మమత, ప్రసూనా, పద్మజా ప్రచారం నిర్వహించారు.



పరిటాల సునీత సమక్షంలో టీడీపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు



బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన గ్రామస్థులు

జగన్‌ను బంగాళాఖాతంలో కలిపేద్దాం

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, మే 3: అవినీతి, అక్రమాల్లో ఏ-1, రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన సీఎం జగన్‌ను బంగాళఖాతంలో కలిపేద్దామని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని పుట్లూరు, నార్పల మండలాల్లో నుంచి వైసీపీ, భారతీయ చైతన్య యువజన పార్టీల నుంచి 150 మంది టీడీపీలోకి చేశారు. పుట్లూరు మండలం అరికటివేములలో దాదాపు 130 మంది మీసాల నారాయణ స్వామి ఆధ్వర్యంలో టీడీపీలోకి బండారు శ్రావణిశ్రీ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరితో పాటు నార్పల మండల పరిధిలోని బి. పప్పూరు, గూగూడు గ్రామాలకు చెందిన 15 మంది వైసీపీ కార్యకర్తలు ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు సమక్షంలో టీడీపీలో చేశారు.

నార్పల మండలం బి పప్పూరు, గూగూడు గ్రామాల్లో ద్విసభ్యకమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, ఆలం వెంకటనరసానాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే అంతా సర్వనాశనం అవుతుందని, అలాంటి వాడిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆకుల అంజినేయులు, ఆకులబాబు పాల్గొన్నారు. గార్లదిన్నె మండలం జమ్ములదిన్నె కొట్టాల, ఓబుళాపురం గ్రామాల్లో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాసుల రెడ్డి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గుర్రం లక్ష్మినారాయణ, ఆవుల క్రిష్టయ్య, గేట్ క్రిష్ణారెడ్డి, గుత్తాబాల క్రిష్ణ, బొగ్గుల వెంకటేష్, వడ్లరాము, వెంకటేష్, హనుమంతురాయుడు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో ప్రచారం

శింగనమల మండలంలోని శింగనమల, గోవిందురాయునిపేట, చిన్నజలాలపురం వెస్టు నరసాపురం, నాగులగుడ్డం. నాగులగుడ్డం తండ, ఆకులేడు, మదిరేపల్లి, లోలూరు గ్రామాల్లో బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రచారం నిర్వహిస్తారు.



గూగూడులో ప్రచారం నిర్వహిస్తున్న ఆలం నరసానాయుడు

అనంతా.. నీ అవినీతిని బట్టబయలు చేస్తాం

రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు



అనంతపురం అర్బన్, మే 3: టీడీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అవినీతి, అరాచకాలను బట్టబయలు చేస్తామని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ప్రకాష్‌నాయుడు హెచ్చరించారు. శుక్రవా రం స్థానిక చంద్రదండు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అనంత హయాంలోనే భూదందాలు, అరాచకాలు, దౌర్జన్యాలు జరిగాయన్నారు. ఈ మాటలను వైసీపీ నాయకులు, కార్యకర్తలే అంటున్నారన్నారు. వైసీపీ ప్రతిపక్షంలో ఉన్న పదేళ్లు పోరాడిన నాయకులకు తగిన గుర్తింపు ఇచ్చావా అని ప్రశ్నించారు. డీఎస్పీ వీరరాఘవరెడ్డిని అడ్డంపెట్టుకొని పోలీసు స్టేషన్లల్లో విచ్చలవిడిగా పంచాయతీలు చేయిస్తున్నాడని ఆరోపించారు. అనంతపురం అర్బన్‌లో ఎక్కడ క్రైం జరిగినా అందుకు అనంత, అతని అల్లుడే కారణమన్నారు. పాత కక్షలతో ప్రసాద్‌రెడ్డి హత్య జరిగితే, ఏ సంబంధం లేని దగ్గుబాటి ప్రసాద్‌కు ఆపాదించడం సంస్కారహీనమన్నారు. దగ్గుబాటి నాన్‌లోకల్ అయితే.... తమ సొంత ఊరు ఏదని నిలదీశారు. జయరాంనాయుడుతో పాటు ఆయన సతీమణిపై అక్రమ కేసు బనాయించడం దుర్మార్గమన్నారు. అనంత అర్బన్ పరిధిలోని ఏ వర్గానికి ఏం న్యాయం చేశావో చెప్పగలవా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో నిన్ను చిత్తుచిత్తుగా ఓడించేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలే సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, లక్ష్మీనాయుడమ్మ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై మొరాయించిన ఆర్టీసీ బస్సు



అనంతపురం కల్చరల్, మే 3: ఆర్టీసీ బస్సు నడిరోడ్డుపై మొరాయించి ఆగిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కళ్యాణదుర్గం డిపోకు చెందిన ఏపీ02టీసీ6880 నెంబరు ఆర్టీసీ బస్సు శుక్రవారం మధ్యాహ్నం కళ్యాణదుర్గం నుంచి బయలుదేరి 3 గంటల సమయంలో అనంతపురం నగరంలోకి ప్రవేశించింది. అయితే బస్సు ఇంజిన్‌లో ఆయిల్ లీకేజీ కారణంగా బస్సు నగరానికి చేరుకునే సమయానికి ఆయిల్ మొత్తం కారిపోయి ఇంజిన్ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో కల్యాణదుర్గం బైపాస్ సర్కిల్‌లో ఫ్లైఓవర్ కింద బస్సును ఆపేసి, మెకానిక్‌ను అక్కడికే పిలిపించుకుని తిరిగి బస్సు బస్టాండుకు తీసుకెళ్లారు.

సి.ఆమిదాలకుంటలో వరుణయాగం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని సి.ఆమిదాలకుంటలో సీతారామాంజనేయ ఆలయంలో శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న వరుణ జపం, వరుణ యాగం శనివారంతో ముగిశాయి. దాతలు ప్రభాకర్, నాగమణి, గ్రామస్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆలయంలో స్వాముల మూలవిరాట్‌లను అలంకరించి ప్రత్యేక పూజలు, వ్రతాలు, జపాలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం పురాణపండిట్ వేణుగోపాల్ వరుణ జపం గురించి భక్తులకు వివరించారు. సమీప గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. అన్నసంతర్పణ నిర్వహించారు.

పది వేల మందికి అందని పింఛన్లు

అనంతపురం క్లాక్‌టవర్: ఆధార్ అనుసంధానమైన బ్యాంకు అకౌంట్లలోకి పింఛన్ సొమ్ము జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో లేవంటూ.. పింఛన్ సొమ్ము జమచేయలేమని ప్రభుత్వం చెబుతోంది. దీంతో జిల్లాలో 10 వేల మంది పండుటాకులకు సొమ్ము చేరలేదు. జిల్లాకు మంజూరైన 2.88లక్షల మంది పింఛన్లలో 2.02లక్షలు ఆన్‌లైన్‌లో బ్యాంకు అకౌంట్లకు, 85వేల మందికి ఇంటివద్దకే పింఛన్ పంపిణీ చేస్తామని ప్రకటించింది. మేడే ఒకటో తేదీ సెలవు కావడంతో 2వ తేదీ, శుక్రవారం పంపిణీ చేపట్టింది. 85 వేలలో మందిలో ఇప్పటి వరకు 83 వేల మందికి పంపిణీ చేశారు. బ్యాంకు అకౌంట్లకు 2.04 లక్షల మందికి జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు 1.94లక్షల మందికి మాత్రమే అకౌంట్లలోకి జమచేశారు. మిగిలిన మొత్తం 10వేల మందికి పింఛన్ అందలేదు. బ్యాంకు ఖాతాల సమస్యలు పింఛన్‌దారులను వెంటాడుతున్నాయి. ప్రభుత్వ కర్కశత్వంతో పండుటాకులు బ్యాంకు అకౌంట్లలోకి పింఛన్ పడిందో లేదో అని తెలుసుకోవడానికి రెండు రోజులుగా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తీవ్రమైన ఎండలతో పింఛన్‌దారులు బ్యాంకుల చుట్టూ తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు. ఆటోల కోసం సుమారు రూ.500వరకు ఖర్చు అవుతోందని బాధితులు వాపోతున్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం : అనారోగ్యం, అప్పులతో జీవితంపై విరక్తి చెందిన పాపంపేటకు చెందిన ఆటో డ్రైవర్ నూర్ మహమ్మద్ (32) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను గత కొంతకాలంగా అస్తమా, జాండిస్‌తో బాధపడుతున్నాడు. వాటికి నయం చేసుకోవడానికి రూ.లక్షల్లో అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గం కనిపించకపోగా, అనారోగ్యం బాధపెడుతుంటే మనస్థాపానికి గురై తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఖాసింబి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎరుకుల సంఘం అధ్యక్షుడిగా సాకే మురళి

అనంతపురంరూరల్ : ఆంధ్రప్రదేశ్ ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా అనంతపురంలోని నవోదయ కాలనీకి చెందిన సాకే మురళి నియమితులయ్యారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాకే చిరంజీవి, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు కావేటి ఉమామహేశ్వరి అతనికి నియామక ఉత్తర్వులు అందజేశారు.

కమాండ్ కంట్రోల్ నిరంతరం నిఘా ఉంచాలి

అనంతపురం టౌన్, మే3: జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టరు వినోద్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాన్ కంట్రోల్ రూమ్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ కమాన్‌కంట్రోల్ సెంటర్‌లో రిజిష్టర్లు సక్రమంగా నమోదు చేయాలన్నారు. వెబ్ క్యాస్టింగ్‌ను నిరంతరం పరిశీలించాలన్నారు. సిబ్బందికి పలు సలహాలు ఇచ్చారు.

'కూటమి' విజయం కోసం ప్రచారం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీలకే ఓటేసి గెలిపించాలని పలువురు ముస్లిం, మైనార్టీ సంఘాల నేతలు ప్రచారం నిర్వహించారు. శుక్రవారం నగరంలోని పలు మసీదుల వద్ద వారు ముస్లింలకు సూపర్‌సిక్స్ పథకాలకు సంబంధించిన కరపత్రాలను అందించారు. ఐఎంఎం వ్యవస్థాపకుడు మహబూబ్ బాషా మాట్లాడుతూ... ముస్లిం మైనార్టీలు అభివృద్ధి ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఫిరోజ్ అహమ్మద్, మున్వర్, టిప్పు సుల్తాన్ అధ్యక్షుడు జాకీర్, నాయకులు కరీముల్లా, హుస్సేన్, నూరు పాల్గొన్నారు.

నేడు ముస్లింల ఆత్మీయ సమావేశం

అనంతపురంరూరల్: కక్కలపల్లి క్రాస్ సమీపంలోని ఆర్ కన్వెన్షన్ హాల్‌లో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు ముస్లీం, మైనార్టీల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ముస్లిం మైనార్టీ నాయకులు తెలిపారు. నియోజకవర్గంలోని ముస్లిం, మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం సెంట్రల్: డిప్లమో ఇన్ హ్యాండ్‌లూం టెక్స్‌టైల్ తిరుపతి జిల్లా వెంకటగిరిలోని శ్రీ ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూం టెక్నాలజి (ఎస్‌పీకేఎం ఐఐహెచ్‌టీ), డిప్లమో ఇన్ హ్యాండ్‌లూం టెక్స్‌టైల్ టెక్నాలజీ (డీహెచ్‌టీటీ) కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి అప్పాజీ ప్రటకనలో తెలిపారు. వివరాలకు 93999 36873ను సంప్రదించాలని సూచించారు.

ఏపీఈసెట్‌కు 37,767 దరఖాస్తులు

బీటెక్ ద్వితీయ సంవత్సరం ప్రవేశాల పరీక్షలకు నిర్వహిస్తున్న ఏపీఈసెట్‌కు 37,767 దరఖాస్తులు వచ్చాయని శుక్రవారం సెట్ నిర్వాహక చైర్మన్, జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, కన్వీనర్ భానుమూర్తి ప్రకటనలో తెలిపారు. 8న నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షలకు 95 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని, అదేవిధంగా హైదరాబాద్‌లో రెండిటిని ఏర్పాటు చేశామన్నారు.

తొలిరోజు 39 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తొలి రోజు 39 మంది ప్రభుత్వ సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు పర్యవేక్షణ ఎన్నికల అధికారి, తహసీల్దార్ లోకేశ్వరీ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం పోస్టల్ బ్యాలెట్ 951 ఓట్లు ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేందుకు స్థానిక ఆర్డీటీ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాగా, వైసీపీ అభ్యర్థికి తొలి రోజు ఏజెంట్లు కూర్చోకపోవడం గమనార్హం.

జగన్‌ను ఇంటికి పంపాల్సిందే

అనంతపురం క్లాక్‌టవర్ : ఐదేళ్ళుగా ప్రభుత్వ ఉద్యోగులను వేధిస్తూ, ఆత్మహత్యలకు కారణమైన సీఎం జగన్‌ను శాశ్వతంగా ఇంటికి పంపాల్సిందేనని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి, అనంతపూర్ క్లబ్ సభ్యుడు లక్ష్మన్న అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఉద్యోగులకు 27 శాతం ఫిట్‌మెంట్ ఇస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామని నమ్మించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చాక మాట మార్చడం దారుణమని మండిపడ్డారు. ఉద్యోగులతో పాటు పెన్షనర్లను అవమానించి, వేధించి నానా అవస్థలకు గురి చేసిన జగన్‌ను బంగాళాఖాతంలోకి కలిపేయాలని కోరారు.

తమ్ముడిపై అన్న దాడి.. తీవ్ర గాయాలు



గాయపడ్డ మల్లికార్జున

శింగనమల మే 3: మండలం పెరవలి రెవెన్యూ పొలంలో బోరు నీటి విషయమై తమ్ముడిపై అన్న దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. ఆస్తి కోసం తనను చంపేందుకు చూశారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నాయనపల్లి గ్రామానికి చెందిన కోదండరాముడు, మల్లికార్జున అన్నదమ్ములు. వీరికి పెరవలి సర్వే నంబరు 159-ఏ పొలంలో ఉమ్మడి వ్యవసాయ బోరు ఉంది. ఆ బోరు నీటిని వాడకం విషయంలో ఇద్దరి మధ్య కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. వీరి మధ్య శుక్రవారం కూడా ఘర్షణ జరిగింది. కోదండరాముడు, అతని కుమారుడు చంద్రశేఖర్ కలసి మల్లికార్జునపై రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. మల్లికార్జున తలకు తీవ్ర గాయమైంది. ఆ దాడి నుంచి తప్పించుకున్న మల్లికార్జున శింగనమల పోలీస్‌స్టేషన్ వచ్చి ఫిర్యాదు చేశాడు. శింగనమల ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. తన అన్న, అన్న కుమారుడు తనపై పలుమార్లు దాడి చేశారని, తన భూమిని కాజేయాలని చూస్తున్నారని బాధితుడు ఆరోపించాడు.

ఈవీఎం కమిషనింగ్‌లో సిబ్బందికి చుక్కలు

అనంతపురం విద్య, మే 3 : ఎన్నికల వేళ... ఈవీఎం కమిషనింగ్ డ్యూటీలో ఉన్న సిబ్బందికి కనీస వసతులు కూడా సక్రమంగా ఏర్పాటు చేయడం లేదని ఉద్యోగుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 13వ తేదీ పోలింగ్ ఉంది. ఈ క్రమంలో పోలింగ్ కోసం ఈవీఎంలను సిద్ధం చేయాల్సి ఉంది. ఇందులో భాగంగా బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్. వీవీ ప్యాట్ మిషన్(ఈవీఎం కమిషనింగ్)ను అనుసంధంగా చేయాలి. ఆర్ట్సుకాలేజ్‌లో శింగనమల నియోజకవర్గం, జూనియర్ కాలేజ్‌లో అనంతపురం, ఎస్ఎస్‌బీఎన్‌లో రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం కమిషనింగ్ పనులు జరుగుతున్నాయి. ఒక్కో అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి సుమారు 180 నుంచి 200 మంది వరకూ సిబ్బందితో కమిషనింగ్ డ్యూటీ చేయిస్తున్నారు. అయితే ఉద్యోగులకు సక్రమంగా వసతులు కల్పించడం లేదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం విధులకు వచ్చిన ఎన్నికల సిబ్బందిని రాత్రి 12, ఒంటి గంట వరకూ కూడా పనులు చేయిస్తున్నారని వాపోతున్నారు. మళ్లీ ఉదయమే డ్యూటీకి రావాల్సి వస్తోందని, కనీసం షిఫ్ట్ డ్యూటీలు కూడా వేయకుండా....చుక్కలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా నిత్యం ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయని, కనీసం చల్లదనం కోసం మజ్జిగ ప్యాకెట్లు కూడా ఇవ్వడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు.

తోపుదుర్తి శైలజారెడ్డిని నిలదీసిన ప్రజలు

రాప్తాడు, మే 3: మండలంలోని బండమీదపల్లిలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వదిన తోపుదుర్తి శైలజారెడ్డి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఓసీ కాలనీపై భాగం ప్రాంతంలో ఆమె ఓట్లు అడిగేందుకు వెళ్లినప్పుడు కొందరు మహిళలు, రైతులు ఆమెను నిలదీశారు. కొన్ని నెలలుగా తమ ప్రాంతానికి నీరు సరఫరా కావడం లేదని, తాగు నీరు రాకపోవడంతో పాడి పశువులు పోషించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. పొలాల వద్ద నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకొని పాడి పశువులు పోషించుకుంటున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు చెప్పినా తమ సమస్య పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపు నిజపాద స్పర్శదర్శనం

అనంతపురం కల్చరల్, మే 3 : చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం రామ్‌నగర్‌లోని రుక్మిణి పాండురంగస్వామి దేవాలయంలో నిజపాద స్పర్శదర్శనం కార్యక్రమం నిర్వహించనున్నట్లు భవసార్ క్షత్రియ సమాజ్ అధ్యక్ష కార్యదర్శులు తిరుపతిరావు, ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

అరటి చెట్లు దగ్ధం

నార్పల, మే 3: స్థానిక రైతు చెన్నారెడ్డికి చెందిన అరటి చెట్లకు శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో నాలుగు వేల చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. చెన్నారెడ్డి తనకున్న ఐదు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశాడు. కోతకు వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో నాలుగు వేల అరటి చెట్లు, డ్రిప్పు పరికరాలు పూర్తిగా దగ్ధమ య్యాయి. సుమారు రూ.12 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

గడ్డివాములు దగ్ధం

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో కురుబ గోవిందుకు చెందిన గడ్డివాములు దగ్ధమ య్యాయి. దీంతో రూ. లక్ష నష్టం వాటిల్లింది. గోవిందు వ్యవసా యం చేసుకునేవాడు. అతనికి యనుములు, ఆవులు ఉన్నాయి. పశుగ్రాసం కోసం దొడ్డిలో సుమారు నాలుగు ట్రాక్టర్ల వరిగడ్డి, శేరుశనగ పొట్టు కొనుగోలు చేసుకుని వాములు వేసుకున్నారు. శుక్రవారం సమీపంలోని విద్యుత్ తీగల నుంచి గడ్డివాములపై నిప్పులు పడ్డాయి. దీంతో ఒక్కసారిగా వాములకు మంటలు వ్యాపించాయి. గడ్డివాములు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. తనను ప్రభుత్వమే ఆదుకోవాలని గోవిందు విజ్ఞప్తి చేస్తున్నాడు.

ఈగో హర్ట్... కరెంటు కట్..!

విద్యుత్ ఉద్యోగుల నిర్వాకంతో చీకట్లో మగ్గిన జనం

అనంతపురంరూరల్, మే 3:

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల ఈగో హర్ట్ కావడంతో 20 ఇళ్ల ప్రజలు రాత్రంతా చీకట్లోనే మగ్గారు. ఉక్కపోతతో రాత్రంతా జాగారం చేశారు. విద్యుత్ సరఫరా చేయమని అర్ధరాత్రి వరకు అధికారులకు ఫోన్ చేసిన ప్రయోజనం లేకుండా పోయింది. మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని శ్రీచైతన్య పాఠశాల ప్రాంతంలో గురువారం రాత్రి 11గంటల సమయంలో విద్యుత్ వైరు కట్ అయి.. కరెంటు పోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ ఉద్యోగులు ఇద్దరు అక్కడికి చేరుకున్నారు. వైరు తగిలించేందుకు ఓ ఉద్యోగి విద్యుత్ స్తంభం ఎక్కాడు. వైరు తగిలించే క్రమంలో కేబుల్ వైర్లు అడ్డువస్తుండటంతో కింద ఉన్న మరో ఉద్యోగి వాటిని తొలగించేయమన్నాడు. ఈసమయంలో అక్కడే ఉన్న ఓ వినియోగదారుడు కేబుల్ వైర్లు కట్ చేసి పర్వాలేదు. నెట్‌కు సంబంధించిన వైరు కట్ చేయకండి. పిల్లలు ఆన్‌లైన్‌లో చదువుకుంటు టారు అని వారితో అన్నాడు. దీంతో విద్యుత్ వైరు తగిలించేందుకు ఎక్కిన ఉద్యోగి ఉన్న ఫలంగా కిందికి దిగాడు. మరో పోల్ ఎక్కి విద్యుత్ వైర్‌ను పూర్తిగా తొలగించి, అక్కడే ఓ ఇంటిలో దాన్ని ఉంచి ఉదయం వస్తామని చెప్పి వెళ్లిపోయాడు. అప్పటికీ కొందరు రాత్రి వేళ మీరు ఇలా వెళ్లిపోతే కరెంటు లేక ఇబ్బంది పడతామని చెప్పినా వినకుండా వెళ్లిపోయారు. విద్యుత్ అధికారికి సమాచారం ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు కరెంటు సరఫరాను పునరుద్ధరించడంతో ఊపిరి పీల్చుకున్నారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి శూన్యం

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్
- రాకెట్లలో కేశవ్ రోడ్‌షోకు ప్రజల నీరాజనం



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉరవకొండ, మే 3: రాష్ట్రంలో వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పయ్యావుల కేశవ్ విమర్శించారు. మండలంలోని రాకెట్ల, ఆమిద్యాల, మోపిడి, ఇంద్రావతి, పెద్దముష్టూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి స్వగ్రామమైన రాకెట్లలో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. రోడ్‌షోలో భాగంగా సైకిల్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కేశవ్ మాట్లాడుతూ సొంత గ్రామాన్ని అభివృద్ధి చేయలేని విశ్వేశ్వరరెడ్డి నియోజకవర్గాన్ని ఏమి అభివృద్ధి చేస్తారో ప్రజలు ఆలోచించాలన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో హంద్రీనీవా కాలువ ద్వారా ఒక ఎకరానికైనా అదనంగా నీటిని అందించారా అని ప్రశ్నించారు. ఆమిద్యాల లిఫ్ట్ పనులకు అతీగతీ లేదన్నారు. కేవలం కొన్ని చోట్ల మాత్రమే గుంతలు తవ్వి బిల్లులు చేసుకున్నారని విమర్శించారు. కాలువలకు సాగునీరు ఇస్తేనే రైతుల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. టీడీపీ హయాంలో 11 చెరువులకు నీళ్లు ఇచ్చామన్నారు. కేంద్రం నిధులు ఇస్తే జగన్ తన స్టిక్కర్లు వేసుకుని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే కూటమి లక్ష్యమన్నారు. ఐదేళ్ల పాలనలో ధరలు ఆకాశన్నంటి జనజీవనం బ్రతుకు భారమైందన్నారు. మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్లు రేగాటి నాగరాజు, బీసీ మారెన్న, మాజీ జడ్పీటీసీ గుర్రంసుధాకర్, మాజీ ఎంపీపీ రత్నమ్మ, నాయకులు సిసింద్రి, నెట్టింశివ, శ్రీధర్, గోవిందు, యర్రగుంట్ల వెంకటేశులు, నెట్టెం బోస్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలుపై ప్రచారం

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో టీడీపీ నాయకులు కార్యకర్తలు సూపర్ సిక్స్ పథకాలుపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో పేదలు ఏవిధంగా నష్టపోయారో వివరించారు. అభివృద్ధి చేశామంటూ 20ఏళ్లు రాష్ట్రాన్ని వెనక్కి నెట్టారని ఆరోపించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి, బెళుగుప్ప గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు శుక్రవారం పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలోకి చేరారు. ఎర్రగుడిలో ఈశ్వరప్ప, నారాయణ స్వామి, జే తిప్పేస్వామి, యర్రిస్వామి, నాగరాజు, మర్రిస్వామి, తిప్పేస్వామిలు, బెళుగుప్పలో శివశంకర, సోము, రామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, వెంకటేశులు రెడ్డి, తిప్పేస్వామి టీడీపీలో చేరగా వారికి పయ్యావుల శ్రీనివాసులు కండువాలు వేసి ఆహ్వానించారు. దబ్బర లక్ష్మీనారాయణ, మనోహర్, ప్రభాకర్, బన్ని అశోక, నుంకన్న, ప్రసాద్, బెళుగుప్ప వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ వన్నూరుస్వామి, కంచి రాముడు పాల్గొన్నారు.



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న పయ్యావుల



టీడీపీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు



అమిలినేని సురేంద్రబాబును గజమాలతో స్వాగతిస్తున్న గ్రామస్థులు



రోడ్‌షోకు హాజరైన అశేష జనవాహిని

టీడీపీతోనే కళ్యాణదుర్గానికి మహర్దశ

- వైసీపీ పాలనలో నియోజకవర్గం అస్తవ్యస్తం
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని

కళ్యాణదుర్గం, మే 3: టీడీపీతోనే కళ్యాణదుర్గానికి మహర్దశ పట్టనుందని కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అన్నారు. శుక్రవారం శెట్టూరు మండల చింతర్లపల్లి, ముచ్చర్లపల్లి, చౌళూరు, కనుకూరు, మల్లేటిపురం, అనుంపల్లి, రంగయ్య పాల్యం, ములకలేడు గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సురేంద్రబాబు మాట్లాడుతూ రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో గ్రామీణ రోడ్ల రూపురేఖలు మారుతాయన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలన్నీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఇప్పుడేమో వైసీపీ మేనిఫెస్టో అంటూ కరపత్రాన్ని పంచుతున్నారన్నారు. అందులో ముఖ్యమంత్రి బొమ్మ, వాళ్ల నాన్న బొమ్మ, ఎమ్మెల్యే అభ్యర్థి బొమ్మలు తప్ప ఏమీ లేవన్నారు. ఇక్కడ మంత్రిగా పనిచేసిన ఉషశ్రీచరణ్, ఎంపీ రంగయ్య కనీసం గ్రామాలకు రహదారులు కూడా వేయలేదంటే ఎంత దౌర్భాగ్యస్థితి వుందో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వం సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు అందించి అందరూ సంతోషంగా పండుగలు జరుపుకోవడం చూశామన్నారు. ఇప్పుడు అమ్మఒడి అంటూ ఇస్తూ నాన్నబుడ్డితో వెనక్కు లాక్కుంటూ సామాన్య ప్రజలను అంధకారంలోకి నెట్టేశారన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల కోసం వారి అభివృద్ధి కోసం పాటుపడే టీడీపీని ఆదరించాలని కోరారు. చిన్నపాటి ఉద్యోగులైన అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నాలుచేసినా వారి వేతనాలు పెంచలేని వ్యక్తి ఇక ప్రాజెక్టులకు ఎక్కడ నిధులిస్తారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబునాయుడును ఒప్పించి రెండున్నరేళ్లలో బీటీపీ కాలువ, కుందుర్పి బ్రాంచ్ కెనాల్‌ను పూర్తిచేసి ప్రతి చెరువుకు సాగునీరు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ రోడ్లకు రూ.200 కోట్ల వరకు అవసరమవుతుందని, కేంద్రం నుంచి కొంత నిధులు తీసుకువచ్చి ఏడాదిలోపు రోడ్లు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు చంద్రబాబునాయుడు పాలన కోరుకుంటున్నారని, 13వ తేదీన ప్రతి ఒక్కరు టీడీపీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. వైసీపీ నాయకులు ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా నియోజకవర్గంలో గెలిచేది టీడీపీనేనని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధికి పాటుపడతా

కుందుర్పి: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అమిలినేని హామీ ఇచ్చారు. మండల కేంద్రంలోని జామియా మసీదులో ముస్లింలతో ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ ఎల్లప్పుడూ మైనార్టీలకు అండగా వుంటుందన్నారు. అనంతరం ముస్లింలు వారి సంప్రదాయం ప్రకారం సన్మానం చేశారు. మాజీ కోఆప్షన్ మెంబర్ తాహిర్, పార్టీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమిలినేని

కళ్యాణదుర్గం రూపురేఖల మార్పు సురేంద్రబాబుతోనే సాధ్యం

కళ్యాణదుర్గంరూరల్: కళ్యాణదుర్గం నియోజకవర్గ రూపురేఖలు మారాలంటే టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుతోనే సాధ్యమని ఐఎస్ఐవి వ్యవస్థాపక అధ్యక్షులు టీపీ రామన్న అన్నారు. శుక్రవారం శెట్టూరులో టీడీపీ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని ఎరడికెర గ్రామానికి చెందిన 8వ వార్డు మెంబర్ గురుస్వామి, పదవ వార్డు మెంబర్ తిమ్మప్ప, వెంకటేశులు మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, ఉపాధి అవకాశాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

ముస్లింలు టీడీపీకి వెన్నుదన్నుగా నిలవాలి

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు



ఈద్గా మసీదు వద్ద ఓటును అభ్యర్థిస్తున్న జయరాం

గుంతకల్లు, మే 3: ముస్లింలు టీడీపీకి వెన్నంటి నిలిచి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయాలని ఉమ్మడి అభ్యర్థి గుమ్మనూరు జయరాం కోరారు. పట్టణంలోని ఈద్గా మైదానం వద్ద ఉన్న మసీదులో శుక్రవారం నమాజు అనంతరం ముస్లింలను కలసి తనకు ఓటువేసి గెలిపించాలని జయరాం అభ్యర్థించారు. పార్టీ కరపత్రాలను అందజేసి ఈవీఎంలో మొదటి నెంబరులో ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, తొలి స్థానంలో ఎంపీ అభ్యర్థిగా అంబికా లక్ష్మీనారాయణ ఉంటామని రెండు ఓట్లూ సైకిల్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. అలాగే ధర్మవరం గేటు వద్ద వ్యాపార సముదాయాలలో, పట్టణంలోని 22, 23 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పాత బస్టాంటు వద్ద ఉన్న స్వర్ణకారుల షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రచారంచేశారు. స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానన్నారు. రాత్రి పరిటాల శ్రీరాములు కళ్యాణమండపంలో ఎస్సీ కుల సంఘాలతో జయరాం భేటీ అయ్యారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, టీఎస్ కృష్ణారెడ్డి, కేసీ హరి, పత్తి హిమబిందు, గుజరీ మహమ్మద్ ఖాజా, ప్రతాప్ నాయుడు, తలారి మస్తానప్ప, హనుమంతు, అంజి, ముష్టూరు తిమ్మప్ప, ఫ్రూట్ మస్తాన్, ఫజులు, యూసుఫ్, పూల రమణ, కొలిమి రామాంజనేయులు, పట్టణంలోని పలు మసీదుల వద్ద గుమ్మనూరు నారాయణ స్వామి, కోడెల చంద్రశేఖర్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్ ముస్లింలను కలసి టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. పార్టీ కార్యాలయంలో పట్టణానికి చెందిన పలు వార్డులవారు జయరాం ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని 25వ వార్డు మెయిన్ బజార్‌లో గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. శ్రీపురం గ్రామానికి చెందిన పది కుటుంబాలవారిని పార్టీ కండువాలతో నారాయణ టీడీపీలోకి ఆహ్వానించారు.

20 కుటుంబాలు చేరిక

పామిడి: మండలంలోని ఖాదర్‌పేట, గజరాంపల్లి గ్రామాల నుంచి 20 కుటుంబాలు శుక్రవారం టీడీపీలోకి చేరాయి. స్థానిక టీడీపీ కార్యాలయంలో గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మనూరు



పామిడి: కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

50 వేల మెజార్టీతో గెలుపు తథ్యం



పార్టీలో చేరుతున్న వైసీపీ గోల్డ్‌స్మిత్ విభాగ నాయకుడు



మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న కాలవ

- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనవాసులు

రాయదుర్గం, మే 3: ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో తన గెలుపు తథ్యమని కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని 5, 6, 9 వార్డులలో రోడ్‌షో నిర్వహించారు. అదే విధంగా ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ఆయన మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు ప్రశాంతమైన పాలనను అందించామన్నారు. రైతులు, మైనార్టీలు, వ్యాపారస్థులు ప్రశాంతతను కోరుకుంటున్నారని దీంతో టీడీపీ గెలుపు సునాయసంగా ఉందన్నారు.

తొగటవీర క్షత్రియుల అభివృద్ధికి కృషి: కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులును మద్దతు ఇచ్చేందుకు తొగటవీర క్షత్రియ సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. శుక్రవారం తొగటవీర క్షత్రియ కళ్యాణమండపంలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన తనకే ఓటు అడిగే హక్కుందన్నారు.

ముస్లింల రిజర్వేషన్లకు ఢోకా లేదు: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక ముస్లింల రిజర్వేషన్లు ఉండవని వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని నాలుగు శాతం రిజర్వేషన్‌లకు ఎలాంటి ఢోకా ఉండదని శాసనమండలి మాజీ అధ్యక్షులు షరీఫ్ అన్నారు. రాయదుర్గం పట్టణంలోని షాదీ మహల్‌లో ముస్లిం మైనార్టీలతో ఆత్మీయ కలయిక సమావేశాన్ని నిర్వహించారు. అదే విధంగా కణేకల్లులో రోడ్‌షో నిర్వహించారు. సమావేశానికి కూటమి అభ్యర్థి కాలవ శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. షరీఫ్ మాట్లాడుతూ ముస్లింల మనోభావాలు దెబ్బతినకుండా కాపాడే విధంగా లౌకికవాదాన్ని పెంపొందించేలా చంద్రబాబు పాలన ఉంటుందన్నారు. కేవలం కేంద్రం సహకారం కోసం బీజేపీతో టీడీపీ పొత్తు పెట్టుకుందన్నారు. ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లను రద్దు చేయడం ఎవరి తరం కాదని స్పష్టం చేశారు. కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 500 మంది లబ్ధిదారులకు దుల్హన్ పథకాన్ని అందించానన్నారు.

టీడీపీలో చేరిన వంద కుటుంబాలు: రాయదుర్గం నియోజకవర్గంలో శుక్రవారం వైసీపీకి బిగ్‌షాక్ తగిలింది. వైసీపీలో కీలక పాత్ర పోషించే వంద కుటుంబాల దాకా శుక్రవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. రాయదుర్గం మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. శుక్రవారం కాలవ శ్రీనివాసులు నివాసంలో మెచ్చిరి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బోర్‌వెల్ నాగరాజురెడ్డి, సదాశివారెడ్డి ఆధ్వర్యంలో గ్రామవాసులు 25 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. రాయదుర్గం పట్టణంలోని గోల్డ్‌స్మిత్ వ్యాపారస్థుడు ఘనితో పాటు 25 కుటుంబాలు టీడీపీలో చేరారు. కణేకల్లు పట్టణంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో 70 కుటుంబాలు చేరాయి. వీరికి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.



కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

తమ్ముడిని హతమార్చిన అన్న

గుంతకల్లుటౌన్, మే 3: మండలంలోని నాగసముద్రం గ్రామంలో అన్న నారాయణరెడ్డి చేతిలో తమ్ముడు రామకృష్ణారెడ్డి (30) హత్యకు గురయ్యాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన నాగిరెడ్డి, లక్ష్మీనారాయణమ్మకు ఇద్దరు కుమారులు నారాయణరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నారాయణరెడ్డి పుట్టకతో నుంచి మూగ, చెవడు ఉందన్నారు. నారాయణరెడ్డి అక్కకు అదే గ్రామానికి చెందిన పెద్దిరెడ్డికి ఇచ్చి వివాహం చేశారు. నారాయణరెడ్డి అక్క ఇంట్లో ఉండేవాడన్నారు. గురువారం ప్రభుత్వ పింఛన్ డబ్బులతో మద్యం సేవించి చికెన్ తీసుకుని అక్క ఇంట్లో వండుకొని తిని ఇంట్లో చికెన్, అన్నాన్ని ఎక్కడపడితే అక్కడ పడేశాడన్నారు. బాలమ్మ భర్త పెద్దిరెడ్డి ఈ విషయాన్ని రామకృష్ణారెడ్డిని ఇంటికి పిలుచుకొని వచ్చి మీ అన్న ఇలా చేశాడని చూపించాడన్నారు. ఇలా చేయడం తప్పుకదా అని నారాయణరెడ్డిని మందలించాడన్నారు. ఈ విషయం నారాయణరెడ్డి మనసులో పెట్టుకున్నాడన్నారు. రామకృష్ణారెడ్డి తన ఇంటి బయట మంచంపై పడుకుని ఉండగా అర్ధరాత్రి నారాయణరెడ్డి కట్టెతో తలపైన కొట్టి చంపాడన్నారు. స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రామకృష్ణారెడ్డికి భార్య వాణి, ఏడు సంవత్సరాల కూతురు ఉందన్నారు. అక్క బాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

బొలెరో ఢీకొని యువకుడి మృతి

పెద్దవడుగూరు, మే 3: మండలంలోని అప్పేచర్ల గ్రామ సమీపం 67వ జాతీయ రహదారిలో శుక్రవారం బొలెరో వాహనం ఢీకొనడంతో మహమ్మద్‌షఫీఉల్లా (21) అనే యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామానికి చెందిన మహమ్మద్‌షఫీఉల్లా వ్యక్తిగత పనినిమిత్తం ద్విచక్రవాహనంలో గుత్తికి వెళుతుండగా అప్పేచర్ల గ్రామ సమీపంలోకి రాగానే బొలెరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బెళుగుప్ప, మే 3: మండలంలోని దుద్దేకుంటలో శుక్రవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం ఎనిమిది బాక్స్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ వెంకట్ తెలిపారు. విక్రేత ఇంటి సమీపంలో మద్యం పట్టుబడిందని, అతనిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చంద్రబాబుతోనే దివ్యాంగుల సంక్షేమం

పామిడి, మే 3: చంద్రబాబుతోనే దివ్యాంగుల సంక్షేమం దరిచేరుతుందని విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్ అన్నారు. పామిడిలో శుక్రవారం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయన ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడితే దివ్యాంగులకు రూ.15వేలు పింఛన్ అందజేస్తామనడం హర్షించదగ్గ విషయమన్నారు. టీడీపీ పట్టణ మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బొమ్మా మోహన్‌కృష్ణ, శ్రీరాములు పాల్గొన్నారు.

పోలైన 167 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

తాడిపత్రిటౌన్, మే3: నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం 167 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు పోలైనట్లు తహసీల్దార్ అంజనేయులు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 2008 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లు ఉన్నాయన్నారు. పట్టణ సమీపంలోని ఆదర్శ పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మొదటిబూత్‌లో పురుషులు 39, స్త్రీలు 57, రెండో బూత్‌లో పురుషులు 56, మహిళలు 15మంది ఓటుహక్కును వినియోగించుకున్నారని ఆయన తెలిపారు.

టీడీపీని ఆదరించండి: శ్రావణిశ్రీ

యల్లనూరు, మే 3: మీ పిల్లల భవిష్యత్తు బంగారుమయం కావాలంటే సైకిల్ గుర్తుకు ఓటువేసి టీడీపీని ఆదరించాలని కూటమి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ప్రజలను అభ్యర్థించారు. మండలంలోని బుక్కాపురం, కూచివారిపల్లి, వాసాపురం గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. వైసీపీ అరాచక పాలన పోవాలంటే సైకిల్‌కు ఓటు వేయాలన్నారు. మండలంలో ఐదేళ్లుగా అభివృద్ధి పడకేసిందన్నారు. తనకు ఒకసారి అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపుతానని ఓటర్లకు విన్నవించారు. ప్రచారంలో గొడ్డుమర్రి పుల్లయ్య, చల్లా చంద్రశేఖర్‌నాయుడు, బొప్పేపల్లి రవీంద్రారెడ్డి, వాసాపురం నరేంద్రనాయుడు, కల్లూరు మల్లికార్జుననాయుడు, వీరభూషణ్, కొడవండ్లపల్లి జయరామకృష్ణ పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న శ్రావణిశ్రీ

పుట్లూరు: మండలంలోని అరకటవేముల గ్రామానికి చెందిన బీసీవై పార్టీ నాయకులు నారాయణస్వామి శుక్రవారం బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. నారాయణస్వామికి కండువా వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

తాగునీటి కోసం ఎంపీడీవో కార్యాలయం ముట్టడి



ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న శ్రీమజ్జనపల్లి వాసులు

కుందుర్పి, మే 3: కుందుర్పి మండల పరిధిలోని శ్రీమజ్జనపల్లి గ్రామస్థులు శుక్రవారం తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. వారు మాట్లాడుతూ పక్షం రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన చేపట్టామన్నారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ట్యాంకర్ల ద్వారా నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

వైసీపీ కండువాతో..

ఉరవకొండ, మే 3: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రంలో రాజశేఖర్ అనే పోలింగ్ ఏజెంటు వైసీపీ కండువాతో కూర్చున్నాడు. పోలింగ్ కేంద్రంలో పార్టీ కండువాతో అటూ ఇటూ తిరిగాడు. ఇలా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు సి-విజిల్ యాప్ ద్వారా కొందరు ఫిర్యాదు చేశారు.



కండువా వేసుకుని తిరుగుతున్న ఏజెంట్ రాజశేఖర్

మెరుగైన వైద్యసేవలందించాలి: డీసీహెచ్ఎస్

పామిడి, మే 3: ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ సూచించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఓపీ రికార్డులను పరిశీలించారు. రికార్డులు అసంపూర్తిగా ఉండడంతో హెడ్ నర్స్ శివకుమారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని సౌకర్యాలు ఉన్నా, స్పెషలిస్టులు ఉన్నా ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ సర్వీసు సిబ్బంది వేతనాలుపై ఆరా తీసి వారంలోగా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకుంటానన్నారు.

హొసగుడ్డం వలంటీర్ తొలగింపు

అనంతపురం టౌన్, మే3: రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాళ్ మండలం హొసగుడ్డం గ్రామ వలంటీర్ గాదిలింగను విధుల నుంచి తొలగిస్తూ కలెక్టరు వినోద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ వలంటీర్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు వేటు వేశారు.

పెద్దపప్పూరును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి



రోడ్‌షోలో మాట్లాడుతున్న అశ్మిత్‌రెడ్డి

పెద్దపప్పూరు, మే 3: టీడీపీ అధికారంలోకి రాగానే మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని చీమలవాగుపల్లి, నరసాపురం, పసలూరు, దేవునిఉప్పలపాడు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బహిరంగ సభల్లో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రధానంగా చేనేత కార్మికులు ముడిసరుకుల ధరలు పెరగడంతో గిట్టుబాటు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పంటపొలాలకు సాగునీరు అందక రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు లేవన్నారు. చాగల్లు, పెండేకల్లు రిజర్వాయర్లకు నీరు తెప్పించే బాధ్యత వ్యక్తిగతంగా తనదని ప్రజలకు హామీ ఇచ్చారు. టీడీపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. తెలుగుయువత ఉపాధ్యక్షుడు తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, గుర్తిరఘునాయుడు, విష్ణువర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు.

10కుటుంబాలు టీడీపీలో చేరిక: మండలంలోని బొందలదిన్నె గ్రామానికి చెందిన 10 కుటుంబాలు శుక్రవారం టీడీపీలో చేరాయి. జేసీ అశ్మిత్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో త్రినాథ్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డితోపాటు పలువురు ఉన్నారు.

సైకోను సాగనంపితేనే రాష్ట్రం సురక్షితం

యాడికి: రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సైకోను సాగనంపితేనే ప్రజలు సురక్షితంగా ఉంటారని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాడికిలో జేసీ పవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం బహిరంగ సమావేశం నిర్వహించారు. దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో ప్రజల భూములన్నింటిని జగన్ దోచేయడానికి చూస్తున్నాడన్నారు. రాష్ట్రానికి పట్టిన ఈ సైకోను ఎన్నికల్లో సాగనంపాలని పిలుపునిచ్చారు. క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, జనసేన మండల కన్వీనర్ సునీల్‌కుమార్, పరిమి చరణ్, కులశేఖర్‌నాయుడు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ దివాకర్ రెడ్డి

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

తాడిపత్రిటౌన్: కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, జేసీ అశ్మిత్‌రెడ్డిలను గెలిపిస్తే తాడిపత్రిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని జేసీ పవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓంశాంతినగర్‌లో శుక్రవారం ఆయన ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మెయిన్‌బజారులోని పెద్దమ్మ ఆలయంలో పవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ జింకా లక్ష్మీదేవి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు హరినాథ్‌రెడ్డి, ఖాదర్‌బాషా, పవన్‌కుమార్‌రెడ్డి, రోషన్న, దినేష్‌రెడ్డి, నరేంద్రనాయుడు, లోకనాథ్‌రెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి తాగునీటి సౌకర్యం

గుంతకల్లుటౌన్, మే 3: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో రోగులకు నీరేదీ అనే కథనం ప్రచురించారు. స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి మున్సిపల్ ట్యాంకర్ ద్వారా ఆసుపత్రి ఆవరణంలో ఉన్న రెండు నీటి ట్యాంకుల్లో నీటిని నింపారు. ఆయన మాట్లాడుతూ రోగులు తాగునీటిని వృథా చేయరాదన్నారు.